


ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	504 (121.7080)	నిల్	800
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	637.66 (2.70)	12.38	నిల్
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	94.65 (0.40)	139	50

చికెన్ ధరలు | లైవ్: రూ.134 | డ్రెస్: రూ.194 | స్కిన్‌లెస్: రూ.224

ఎన్నుకున్న ప్రజలకు సేవ చేయాలని, తమ పాలనా హయాంలో శాశ్వతంగా గుర్తుండేలా పనులు చేయాలని, తమ వద్దకు వస్తే ఏ పనైనా చిటికెలో చేసేయాలనే సంకల్పంతో ఎన్నికల్లో పోరాడి గెలిచిన ఆ నాయకులు ప్రస్తుతం పూర్తి నైరాశ్యంతో పదవీ విరమణ చేస్తున్నారు. మండల ప్రాదేశిక నియోజవర్గ సభ్యుడి (ఎంపీటీసీ)గా ఐదేళ్లలో చెప్పుకోదగ్గ పనులేవీ చేయలేకపోయామని, ప్రజలకిచ్చిన హామీలు నెరవేర్చలేకపోయామని, అంతేకాదు కనీసం గౌరవాన్ని కూడా పొందలేకపోయామనే ఆవేదన వారిలో ఉంది. బుధవారంతో ఎంపీపీలు, ఎంపీటీసీ సభ్యుల పదవీకాలం ముగియనుంది.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి, నల్లగొండ)



చేసిందేమీలేక.. చెప్పుకోలేక

- నైరాశ్యంతో పదవీ విరమణ చేస్తున్న ఎంపీటీసీ సభ్యులు
- ఐదేళ్లు ఉత్సవ విగ్రహాలుగానే మిగిలామని ఆవేదన
- నిధులు, విధుల్లేక నీరసించిన పరిషత్‌లు
- కనీస గౌరవం కూడా దక్కలేదని అంతర్మథనం
- ఈ ప్రభుత్వమైనా బలోపేతం చేయాలని సూచన
- సర్పంచ్‌లతో సమానంగా అధికారాలివ్వాలని అభిప్రాయాలు

పదవీ కాలంలో ఉత్సవ విగ్రహాలుగా మిగిలామే తప్ప సాధించిందేమీ లేదని, ఈ వ్యవస్థ బలోపేతానికి ప్రభుత్వాలు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం బాధ కలిగించిందని, ప్రస్తుత ప్రభుత్వమైనా బలోపేతం చేసేందుకు కృషి చేయాలని ఎంపీటీసీలు కోరుతున్నారు. 73వ రాజ్యాంగ సవరణ ప్రకారం అధికారాలు, విధులు బదలాయించాలని వారు అభిప్రాయపడుతున్నారు.

ఐదేళ్లలో నిధుల్లేవు.. విధుల్లేవు

రాజ్యాంగ సవరణ 73 ప్రకారం ఏర్పాటైన ఐదంచెల పంచాయతీరాజ్ వ్యవస్థలో మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాలు ఏర్పాటయ్యాయి. కనీసం మూడువేల జనాభాకు తగ్గకుండా ఈ స్థానాలను నిర్దేశించారు. ఒక్కో మండల ప్రజాపరిషత్ పరిధిలో కనిష్ఠంగా 4 నుంచి గరిష్ఠంగా 19 వరకు ఉమ్మడి జిల్లాలో ఈ నియోజకవర్గాలు ఉన్నాయి. 2014కు ముందు మండల పరిషత్‌లకు కేంద్రం నుంచి వచ్చే ఆర్థిక సంఘాల నిధుల్లో 35శాతం వాటా ఉండేది. అదే విధంగా రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు, బీఆర్‌జీఎఫ్ నిధులు వచ్చేవి. ఇవన్నీ కలిపి ఒక్కో ఎంపీటీసీ సభ్యుడి పరిధిలో ఏడాదికి కనీసంగా రూ.10లక్షలకు తగ్గకుండా నిధులొచ్చేవి. వాటితో లింకురోడ్లు, తాగునీటి పైప్‌లైన్ల మరమ్మతులు, అదనపు తరగతి గదుల వంటి నిర్మాణాలు చేపట్టేవారు. అయితే 2014తర్వాత కేంద్రం నుంచి వచ్చే పంచాయతీరాజ్ నిధులను 90శాతం గ్రామ పంచాయతీలకే కేటాయించడంతో ఆ మేరకు మండల, జిల్లా పరిషత్‌లకు నిధులకొరత ఏర్పడింది. దానికి తోడు రాష్ట్ర ప్రభుత్వం సైతం ఎంపీపీ, జడ్పీ చైర్మన్ ఎన్నిక సమయంలో తప్ప మిగిలిన సందర్భాల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యులకు కనీస ప్రాధాన్యం ఇవ్వలేదు. తమకు కనీస బాధ్యతలు, నిధులు, విధులు కేటాయించాలని వీరు పలు సందర్భాల్లో ఆందోళనలు, ధర్నాలు చేసినా పరిస్థితి మారలేదు. ఎంపీటీసీ స్థానం పరిధిలో ఐదేళ్లలో రూ.5లక్షల నుంచి రూ.7లక్షలకు మించి నిధులు రాలేదని, వీటితో ఆశించిన రీతిలో పనులు చేయలేకపోయామని పలువురు ఎంపీటీసీ సభ్యులు వాపోయారు. గ్రామపంచాయతీల్లో వార్డుమెంబర్‌కు ఉన్న గౌరవం, మర్యాద కూడా తమకు ఇవ్వలేదని, పంచాయతీ కార్యాలయాల్లో ప్రత్యేక ఛాంబర్ ఇవ్వలేదని, పంచాయతీలకు వచ్చే నిధులతో చేపట్టే పనుల్లో తాము సూచించినవి చేపట్టలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎంపీటీసీ సభ్యుడిగా కనీసం బోరుమోటర్ కూడా మరమ్మతు చేయించలేని దుస్థితిని ఎదుర్కొన్నామని పలువురు సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో మండల పరిషత్‌ల వివరాలు

జిల్లా	మండల పరిషత్‌లు	ఎంపీటీసీల సంఖ్య
నల్లగొండ	31	350
సూర్యాపేట	23	225
యాదాద్రి	17	177
మొత్తం	71	752

విధులు, బాధ్యతలు ఇవ్వాలి

పంచాయతీరాజ్‌లో ఐదంచెల వ్యవస్థను నెలకొల్పిన కాంగ్రెస్ హయాంలోనైనా జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులకు నిధులు, విధులు, గౌరవం పెంచాలని పదవీ విరమణ చెందుతున్న ఎంపీటీసీ సభ్యులు కోరుతున్నారు. ప్రధానంగా గ్రామపంచాయతీల్లో సర్పంచ్‌లకు సమానంగా ఎంపీటీసీ సభ్యులకు నిధులు, విధులు, బాధ్యతలు కేటాయించాలంటున్నారు. పంచాయతీలకు వచ్చే నిధులతో చేపట్టే పనులను గుర్తించడంలో ఎంపీటీసీ సభ్యుల సూచనలకు తప్పనిసరిగా ప్రాధాన్యమివ్వాలని, గ్రామపంచాయతీల్లో ప్రత్యేక ఛాంబర్ ఇవ్వాలని, ఎంపీటీసీ పరిధిలో ఒక ఉద్యోగిని కూడా కేటాయించాలని కోరుతున్నారు. మండల పరిషత్‌లకు వ్యవసాయం, మైనింగ్, ప్రాథమిక విద్యాశాఖ, డీఆర్‌డీఏ శాఖలను అప్పగిస్తే వాటిని ప్రజలకు చేరువచేసేందుకు ఎంపీటీసీ సభ్యులకు వెసలుబాటు లభిస్తుందని, ఆ దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఉత్సవ విగ్రహాలుగానే మిగిలాం



ఎంపీటీసీ సభ్యుడిగా ఎంతో చేయాలనే సంకల్పంతో ఎన్నికల్లో పోటీచేసి గెలుపొందా. గ్రామాల్లో ఉన్న ఎన్నో సమస్యలు పరిష్కరించాలనుకున్నాం. కానీ ఎంపీటీసీ వ్యవస్థ ఆరోవేలులా మారింది. మండలాలకు కనీస నిధుల్లేక ఏపనులూ చేయలేకపోయాం. ఐదేళ్లలో కేవలం రూ.7లక్షల నిధులే రావడం అంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఈ ప్రభుత్వమైనా ఎంపీటీసీ వ్యవస్థకు నిధులు, విధులు ఇస్తుందని ఆశిస్తున్నాం.

- పాలడుగు హరికృష్ణ, పిట్టంపల్లి ఎంపీటీసీ, కట్టంగూరు

ఎంపీటీసీ పరిధిలో 40శాతం నిధులు కేటాయించాలి



ఐదేళ్లలో ఆశించిన పనులేవీ చేయలేకపోయాం. ప్రత్యక్ష ఎన్నికల్లో గెలుపొందినా, ప్రజలకు ఇచ్చిన కనీస హామీలు అమలు చేయలేకపోయామనే ఆవేదన మిగిలింది. నిధుల విషయానికి వస్తే మేం ప్రతిపక్ష పార్టీ కావడంతో అప్పటి అధికార పార్టీ నాయకులు మాకు వచ్చిన కొద్ది నిధులు కూడా దక్కకుండా చేశారు. ఈ వివక్షపై పోరాడినా ఫలితం దక్కలేదు. ఎంపీటీసీలకు గ్రామపంచాయతీల్లో సర్పంచ్‌లకు సమానంగా అధికారాలు ఇవ్వాలి. నిధుల విషయంలో 40శాతం ఎంపీటీసీలకు కేటాయించాలి. ఈ వ్యవస్థను బలోపేతం చేయకపోతే ఉపయోగం ఉండదు.

- చల్లభట్ల చైతన్య, వేములపల్లి ఎంపీటీసీ

పేరుకే తప్ప పదవితో ప్రయోజనం లేదు



ఎంపీటీసీ సభ్యురాలిగా కొనసాగిన ఐదేళ్లలో చెప్పుకోదగ్గ పని ఒక్కటీ చేయలేకపోయాం. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు కూడా నెరవేర్చలేకపోయాం. మండల పరిషత్ సమావేశాల్లో మా ఆవేదన వెలిబుచ్చడమే తప్ప చేసిందేమీ లేదు. కనీస నిధులు, బాధ్యతలు లేకపోవడంతో ఈ పదవుల వల్ల ప్రయోజనం లేకుండా పోయింది. ఐదేళ్లలో కనీసం ఐదు పనులు కూడా చెప్పుకోదగ్గస్థాయిలో చేయలేకపోయాం.

- ముక్తినేని అనూష, జంగారెడ్డిగూడెం ఎంపీటీసీ, తిప్పర్తి

నేడు, రేపు ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం

- అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, ఆవరణలు శుభ్రంగా ఉండాలి
- కలెక్టర్ సి.నారాయణరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సి.నారాయణరెడ్డి

నల్లగొండ టౌన్, జూలై 2: ప్రభుత్వ కార్యాలయాల పరిశుభ్రతలో భాగంగా జిల్లావ్యాప్తంగా అన్ని కార్యాలయాల్లో బుధ, గురువారాలు రెండు రోజులు ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని చేపట్టాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి జిల్లా అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన ఈ విషయమై జిల్లా అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యాలయాల్లో పారిశుధ్య నిర్వహణ ఉండటంలేదని, టాయిలెట్లు సరిగాలేవని ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో ఇలాంటి ఫిర్యాదులు రాకుండా ఉండేందుకు ప్రత్యేక ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. అన్ని జిల్లా కార్యాలయాలను పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత సంబంధిత జిల్లా అధికారితోపాటు, సిబ్బందిపై ఉందని, వారి కార్యాలయాలను శుభ్రంగా ఉంచడమే కాకుండా, కలెక్టర్ కార్యాలయంలోని అన్ని కారిడార్లు శుభ్రంగా ఉంచాలన్నారు. రెండు రోజులపాటు ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం నిర్వహించాలని, రాబోయే నాలుగు రోజులు ఈ కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యమివ్వాలన్నారు. అవసరమైన చోట వెంటనే మరమ్మతులు చేయించుకోవాలన్నారు. శనివారం నాటికి అన్ని కార్యాలయాల్లో పూర్తి పరిశుభ్రత ఉండేలా చర్యలు తీసుకోవాలని, వచ్చే సోమవారం జిల్లా స్థాయి ప్రజావాణి కార్యక్రమం ఉంటుందన్నారు. అనంతరం ఆదనపు కలెక్టర్లు కలెక్టర్ కార్యాలయంలోని అన్ని కార్యాలయాలతో పాటు, బయట ఉన్న కార్యాలయాల్లో సైతం తనిఖీలు నిర్వహిస్తారని, ఎవరైనా శానిటేషన్‌పై నిర్లక్ష్యం వహిస్తే చర్య తీసుకుంటామన్నారు. అంతకుముందు కలెక్టరేట్‌లోని సెక్షన్ల విభాగాల అధిపతులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉద్యోగులు సమయపాలన పాటించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, జిల్లా రెవెన్యూ అధికారి డి.రాజ్యలక్ష్మి, కలెక్టర్ కార్యాలయ పరిపాలన అధికారి మోతీలాల్, జిల్లా సమాచార అధికారి గణపతిరావు, ఆయా విభాగాల పర్యవేక్షకులు, తదితరులు పాల్గొనగా, టెలీకాన్ఫరెన్స్‌కు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ టీ.పూర్ణచంద్ర, అదనపు కలెక్టర్ శ్రీనివాస్, జిల్లా రెవెన్యూ అధికారి రాజ్యలక్ష్మి హాజరయ్యారు.

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి చేయాలి

- పిల్లలతో వెట్టిచాకిరీ చేయిస్తే క్రిమినల్ కేసు
- బాలకార్మికులు కనిపిస్తే 1098, డయల్ 100కు సమాచారం ఇవ్వాలి
- ఎస్పీ శరత్‌చంద్ర పవార్



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ క్రైం, జూలై 2: బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతీ ఒక్కరు కృషి చేయాల్సిన అవసరం ఉందని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటుచేసిన ఆపరేషన్ ముస్కాన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. నిరాదరణకు గురైన, తప్పిపోయిన, వెట్టిచాకిరీకి గురవుతున్న బాలలను సంరక్షించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏటా జనవరిలో ఆపరేషన్ స్మైల్, జూలైలో ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయన్నారు. ఈ నెల 1వ తేదీన ప్రారంభమైన ఆపరేషన్ ముస్కాన్ 31వ తేదీ వరకు నెలరోజుల పాటు సాగుతుందన్నారు. పోలీస్ అధికారులు, చైల్డ్‌వెల్ఫేర్ కమిటీ, కార్మిక, విద్యాశాఖ, చైల్డ్‌ప్రొటెక్షన్, వైద్యశాఖ తోపాటు పలువురు అధికారుల సమన్వయంతో జిల్లా వ్యాప్తంగా ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. 18 ఏళ్లలోపు తప్పిపోయిన, వదిలేసిన, కిరాణ, మెకానిక్ షాపులు, హోటళ్లు, వివిధ కంపెనీల్లో పనిచేస్తున్న, భిక్షాటన చేస్తున్న పిల్లలు, బాలకార్మికులు ఉంటే వారిని గుర్తించి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చి వారికి అప్పగించడం లేదా స్టేట్‌హోంకు పంపిస్తామన్నారు. బాలల స్వేచ్ఛ, వికాసానికి భంగం కలిగించినా, వెట్టిచాకిరీ చేయించినా వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. బాలకార్మికులు కనిపిస్తే 1098 లేదా, డయల్ 100కు సమాచారం ఇవ్వాలన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీ రాములు నాయక్, ఎస్‌బీ డీఎస్పీ రమేశ్, డీసీఆర్‌బీ డీఎస్పీ సైదా, చైల్డ్‌వెల్ఫేర్ కమిటీ చైర్మన్ కృష్ణ, లేబర్ వెల్ఫేర్ ఆఫీసర్ సక్కుబాయి, అసిస్టెంట్ లేబర్ వెల్ఫేర్ ఆఫీసర్ రాజు, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించకుంటే సహించేది లేదు

డీఎంహెచ్‌వో కల్యాణ చక్రవర్తి



శాలిగౌరారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో కల్యాణ చక్రవర్తి

శాలిగౌరారం, జూలై 2: సమయపాలన పాటించకుంటే సహించేది లేదని, రోగులకు సకాలంలో వైద్య సేవలు అందించని వైద్య సిబ్బందిపై చర్యలు తప్పవని డీఎంహెచ్‌వో కల్యాణ చక్రవర్తి హెచ్చరించారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. కేంద్రంలోని రికార్డులను, మందులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత నెలలో ఎమ్మెల్యే మందుల సామేలు ఆస్పత్రిని తనిఖీ చేసి వైద్య సిబ్బంది పని తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారని, అందుకే మరోమారు తనిఖీకి వచ్చినట్లు చెప్పారు. ఇక్కడి వైద్య సిబ్బంది చుట్టపుచూపుగా వచ్చి పోతున్నారనే ఆరోపణలు ఉన్నాయని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. 24గంటల ఈ ఆస్పత్రిలో సిబ్బంది కొరత ఉన్నందున షిఫ్ట్ పద్ధతిలో డ్యూటీలు వేస్తున్నట్లు తెలిపారు. ఇక నుంచి ఏ ఉద్యోగి గైర్హాజరైనా ఇంటికే పంపిస్తామన్నారు. త్వరలో ఒక యాప్ ఏర్పాటు చేసే ఆలోచనలో కలెక్టర్ ఉన్నారని, అది అమలైతే సిబ్బంది పనితీరుపై పర్యవేక్షణ ఉంటుందన్నారు. ఇక్కడి పీహెచ్‌సీలో నలుగురు స్టాఫ్ నర్స్‌లకు మూడు పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. డీఎంహెచ్‌వో వెంట డిప్యూటీ డీఎంహెచ్‌వో కె.వేణుగోపాల్‌రెడ్డి, మండల వైద్యాధికారి సూర్య శిల్ప, తదితరులు ఉన్నారు.

ప్రజా సమస్యలపై ఉద్యమాలు చేపట్టాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి



సమావేశంలో మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ, జూలై 2: ప్రజా సమస్యలపై బలమైన ఉద్యమాలు నిర్వహించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం స్థానికంగా నియోజకవర్గ పార్టీ సభ్యులకు నిర్వహించిన రాజకీయ శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. ప్రభుత్వాలు మారినా ప్రజా జీవితాలు మారడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్‌పరం చేసి ప్రజా సంపదను దోచిపెడుతోందని విమర్శించారు. సింగరేణి గనులను పెట్టుబడిదారులకు అప్పగించేందుకు సిద్ధమైందన్నారు. ప్రజావ్యతిరేక విధానాలను బలమైన ఉద్యమాలతో తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. 'కమ్యూనిస్టు ఉద్యమం-వర్తమాన భారతదేశం' అనే అంశంపై ఏపీ సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు మిరియం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, పార్టీ కార్యకర్తలు దేశ రాజకీయ, ఆర్థిక విధానాలపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. పార్టీ నిర్మాణంపై సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు పోతినేని సుదర్శన్ మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు డబ్బికార్ మల్లేష్, వీరేపల్లి వెంకటేశ్వర్లు, రవినాయక్, గౌతమ్‌రెడ్డి, భవాండ్ల పాండు, పరుశరాములు, వినోద్‌నాయక్, రాగిరెడ్డి మంగారెడ్డి, రొంది శ్రీను, వరలక్ష్మి, చౌగాని సీతారాములు, గాదె పద్మ, గోవర్ధన్, పగిడోజు రాంమూర్తి, జటంగి సైదులు, తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా, రైతులకు కనీస మద్దతు ధరల గ్యారెంటీ చట్టం అమలు చేయాలని రైతు సంఘం ఆధ్వర్యంలో సీపీఎం నాయకులు, కార్యకర్తలు పట్టణంలో ర్యాలీ నిర్వహించి కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు.

ఎస్‌ఈగా గంగం శ్రీనివాస్‌రెడ్డికి పూర్తి అదనపు బాధ్యతలు



గంగం శ్రీనివాస్‌రెడ్డి

నార్కట్‌పల్లి, జూలై 2: ఏఎమ్మార్పీ, నీటి పారుదలశాఖ ఎస్‌ఈగా ప్రస్తుత ఈఈ గంగం శ్రీనివాస్‌రెడ్డి నియమితులయ్యారు. ఆయనకు (ఎఫ్‌ఏసీ) పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుత ఎస్‌ఈ అజయ్‌కుమార్ దీర్ఘకాలిక సెలవుపై వెళ్లడంతో శ్రీనివాస్‌రెడ్డిని నియమించాలని మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సూచన మేరకు నీటి పారుదల శాఖ కార్యదర్శి నియామక ఉత్తర్వులను జారీ చేశారు. కార్యదర్శి ఉత్తర్వుల మేరకు ఎస్‌ఈగా ఆయన మంగళవారం బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తనపై ఎంతో నమ్మకంతో ఎస్‌ఈగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించిన మంత్రుల లక్ష్యాల మేరకు జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టుల పనులను వేగవంతం చేసేందుకు శాయశక్తులా కృషి చేస్తానని అన్నారు.

అధ్యాపకులు నైపుణ్యాల పెంపుపై దృష్టి సారించాలి

ఎంజీయూ రిజిస్ట్రార్ అల్వాల రవి

నల్లగొండ టౌన్, జూలై 2: అధ్యాపకులు అధ్యయనం, నైపుణ్యాల పెంపుపై దృష్టి సారించాలని మహాత్మాగాంధీ యూనివర్సిటీ రిజిస్ట్రార్ అల్వాల రవి అన్నారు. ఎంజీయూ సెంటర్ ఫర్ ఎక్సలెన్స్, ఎడ్యునెట్ ఫౌండేషన్ న్యూఢిల్లీ, తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించతలపెట్టిన అధ్యాపకుల ఐదు రోజుల శిక్షణా తరగతులను అల్వాల రవి, కొప్పుల అంజిరెడ్డి, టాస్క్ అధికారులతో కలసి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ రవి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నైపుణ్యాల పెంపుపై దృష్టి సారించాలన్నారు. మారుతున్న సాంకేతికతను అందిపుచ్చుకొని, సమాజంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. నేడు నిర్ణయాలు అన్ని డేటా, మెషిన్ లెర్నింగ్, కృత్రిమ మేధ ఆధారంగా జరుగుతున్న నేపథ్యంలో అధ్యాపకులు సైతం వీటిపై అవగాహన పెంచుకోవాలన్నారు. అధ్యాపకులు తమ నైపుణ్యాలను ఎప్పటికప్పుడు నవీకరించుకుంటూ విద్యార్థులను జాగ్రత్తపరుస్తూ సమాజానికి, పరిశ్రమకు అనుసంధానకర్తలుగా నిలవాలన్నారు. ఎడ్యునెట్ న్యూఢిల్లీ వారి సహకారంతో ఏర్పాటు చేసిన సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ ద్వారా మొట్టమొదటి కార్యక్రమాన్ని నిర్వహించడం శుభసూచకమన్నారు. ఈసెంటర్ ద్వారా అధ్యాపకులకు, విద్యార్థులకు అధునాతన సాంకేతిక పరిజ్ఞానంపై శిక్షణలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ సుధారాణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఇంజనీరింగ్ కళాశాల డీన్ రేఖ, ప్లేస్‌మెంట్ సెల్ డైరెక్టర్ ప్రశాంతి, జయంతి, దుర్గాప్రసాద్, టాస్క్ అధికారులు జి.సుధీర్, సుమిత్, సునీల్, పవన్ తదితరులు పాల్గొన్నారు.



పత్తి సాగుకు ఊరటనిచ్చిన వర్షం

● ఊపిరి పీల్చుకున్న రైతులు


చౌటుప్పల్‌లో వర్షానికి తాజాగా కనబడుతున్న పత్తి మొలకలు

చౌటుప్పల్ టౌన్, జూలై 2: యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ ప్రాంతంలో ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి పత్తి సాగుకు కొంత ఊరట కలిగింది. రైతులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ ప్రాంతంలో కొద్దిరోజులుగా వర్షాభావ పరిస్థితు నెలకొనడంతో పత్తి సాగుకు ఇబ్బందికరమైన వాతావరణం నెలకొంది. మే నెల చివర, జూన్ నెల మొదటివారంలో కురిసిన వర్షాలకు రైతులు పత్తి గింజలను విత్తారు. అప్పటి నుంచి వర్షాలు కురియకపోవడంతో దుక్కుల్లోని విత్తనాలు మాడిపోయాయి. ఎండల వేడిమికి కొన్ని ప్రాంతాల్లో పత్తి మొలకలు ఎండిపోయాయి. దీంతో విత్తనాలు మాడిపోవడంతో పాటు మొలకలు ఎండిపోయిన ప్రాంతాల్లో మళ్లీ పత్తి విత్తనాలను విత్తాల్సిన పరిస్థితి రైతులకు ఏర్పడింది. కొంతమంది రైతులు రెండు, మూడుసార్లు కూడా పత్తి విత్తనాలను దుక్కులలో విత్తారు. పత్తి విత్తనాల రెండు, మూడుసార్లు విత్తాల్సి రావడంతో రైతులకు అదనపు భారంగా మారింది. పత్తి విత్తనాల కోసం రైతులు వేల రూపాయలను ఖర్చు చేయాల్సి వస్తోంది. వర్షాభావ పరిస్థితులతో రైతులకు విపత్కర పరిస్థితి ఏర్పడింది. వారం రోజుల క్రితం పెద్దకొండూరు, ఎస్.లింగోటం గ్రామాల్లో కురిసిన వర్షాలకు ఆయా ప్రాంతాలలోని పత్తి సాగుకు కొంత ఊరట లభించింది. ఆరెగూడెం, కాట్రేవు, పంతంగి, చౌటుప్పల్, తంగడపల్లి తదితర గ్రామాల్లో వర్షపాతం తక్కువగా ఉండగా ఆదివారం రాత్రి కురిసిన వర్షంతో రైతులకు కొంత ఊరట లభించింది. పత్తి మొలకలు ఎండిపోకుండా ఈ వర్షం కాపాడిందని రైతులు తెలుపుతున్నారు. మండలవ్యాప్తంగా 11,500 ఎకరాలలో పత్తి విత్తనాలను విత్తినట్టు ఏవో నాగరాజు తెలిపారు. కొద్ది పాటిగా కురిసిన వర్షంతో పత్తి సాగుకు ఎంతో మేలు జరిగింది.

మూడు సార్లు పత్తి విత్తనాలను విత్తా

సమయానికి వర్షాలు కురియకపోవడంతో దుక్కుల్లోని పత్తి విత్తనాలు మాడిపోయాయి. మొలకలు ఎండిపోయాయి. దీంతో రెండు, మూడుసార్లు పత్తి విత్తనాలను విత్తాల్సి వచ్చింది. 20 ఎకరాల్లో పత్తి సాగు చేశా. పత్తి విత్తనాలకు రూ.1.50 లక్షలు ఖర్చు చేశా. ఆదివారం రాత్రి కురిసిన వర్షంతో పత్తి మొలకలకు కొద్దిపాటి తేమ మాత్రమే అందింది. ముందు ముందు పెద్ద వర్షాలు కురిస్తేనే పత్తి సాగుకు ప్రయోజనం కలుగుతుంది. లేకుంటే నష్టాల బారిన పడాల్సి వస్తుంది.

- జాల అయిలయ్య యాదవ్, రైతు, ఆరె గూడెం, చౌటుప్పల్ మండలం

బాల్యంపై బ్యాగుల మోత

● మోయలేక విద్యార్థులకు ఇబ్బందులు ● శారీరక ఎదుగుదలపై తీవ్రప్రభావం ● అమలుకు నోచుకోని నిబంధనలు



సూర్యాపేట(కలెక్టరేట్), జూలై 2: ఆడు తూ పాడుతూ సాగాల్సిన చదువులు విద్యార్థుల పాలిట భారంగా మారాయి. ఒక్కో విద్యార్థి ఒకటి రెండు బ్యాగులను రోజూ మోయాల్సి వస్తోంది. ప్రైవేట్ పాఠశాలల్లో పుస్తకాలు, నోట్‌బుక్స్‌లు ఎక్కువగా వినియోగిస్తున్నారు. ప్రైవేట్ విద్యాసంస్థలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వివిధరకాల పాఠ్య, నోట్ పుస్తకాలను ఉపయోగిస్తున్నారు. దీంతో విద్యార్థులు ప్రతి రోజూ వాటిని మోసుకుంటూ పాఠశాలలకు వెళ్లి రావడంతో ఆరోగ్య ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పరిమితికి మించిన బరువులను మోయలేక వంగిపోతున్నారు. అధిక బరువుతో విద్యార్థుల శారీరక ఎదుగుదలపై ప్రభావం పడుతుంది. విద్యార్థుల బ్యాగుల భారాన్ని తగ్గించేందుకు చిల్డ్రన్స్ స్కూల్ బ్యాగ్స్ యాక్ట్ -2006 ఉన్నప్పటికీ అమలుకు నోచుకోవడంలేదు. చేసేది లేక విద్యార్థులు అధిక బరువుతో విద్యనభ్యసిస్తున్నారు. అంతేకాక జిల్లాలోని పలు ప్రైవేట్ విద్యా సంస్థలకు చెందిన భవనాలు మూడు, నాలుగు అంతస్తులలో ఉంటున్నాయి. అధిక బరువుతో కూడిన బ్యాగులను భుజాన వేసుకొని అన్ని అంతస్తులను ఎక్కాల్సి వస్తోంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 6 నుంచి 9వ తరగతి విద్యార్థులకు కేవలం 6 కిలోల బ్యాగ్ మాత్రమే ఉండాలి. 12 కిలోల బ్యాగ్‌తో ఉన్న పుస్తకాలను ప్రస్తుతం విద్యార్థులు మోస్తున్నారు. సాధారణ ఒక విద్యార్థి ఎంత బరువు ఉంటే అందులో 10వ శాతం బరువు ఉన్న బ్యాగ్‌లను మాత్రమే మోయాలి. కానీ 10శాతం కన్న ఎక్కువగా కూడా మోస్తున్నారు. దీంతో భవిష్యత్‌లో అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. వెన్నుపూస దెబ్బతినే ప్రమాదముంది. మోకాళ్ల నొప్పులును కూడా పెద్దయిన తర్వాత ఎదుర్కోవాల్సి వస్తుందంటున్నారు. గూని కూడా వచ్చే అవకాశమున్నట్లు డాక్టర్లు హెచ్చరిస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు మొత్తం 4,129 ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో 4,60,823 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. సూర్యాపేట జిల్లాలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు 690, ప్రాథమికోన్నత పాఠశాలలు 78, ఉన్నత పాఠశాలలు 182 ఉన్నాయి. ఆయాపాఠశాలల్లో 58,999 మంది విద్యార్థులు చదువుతున్నారు. అదేవిధంగా ప్రైవేట్ పాఠశాలలు 248 ఉండగా 65వేల మంది విద్యనభ్యసిస్తున్నారు. నల్లగొండ జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు 1,593 ఉండగా ఆయా పాఠశాలల్లో 1,22,262 మంది, ప్రైవేట్ పాఠశాలలు 453 ఉండగా 1,10,752 మంది చదువుతున్నారు. అదేవిధంగా యాదాద్రి-భువనగిరి జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు 712 ఉండగా 59,996 మంది, ప్రైవేట్ పాఠశాలలు 173 ఉండగా 43,814 మంది విద్యనభ్యసిస్తున్నారు. ఎక్కువగా ప్రైవేట్ పాఠశాలల్లోనే విద్యార్థులకు పుస్తకాల బరువు ఎక్కువగా ఉంటుంది.

అమలుకు నోచుకోని చట్టం

విద్యార్థులు అధిక బ్యాగుల బరువును నియంత్రించేందుకు చిల్డ్రన్స్ స్కూల్ బ్యాగు యాక్ట్ -2006ను ప్రవేశపెట్టారు. ఈ చట్టం ఎక్కడ అమలుకు నోచుకోవడంలేదు. నర్సరీ విద్యార్థులకు పాఠ్య, నోట్ పుస్తకాలు కలిపి కనీసం 10వరకు ఉంటున్నాయి. ఇదే తరహాలో విద్యార్థుల తరగతులను అనుసరించి పుస్తకాల సంఖ్య పెరుగుతూ వస్తోంది. ప్రభుత్వ నిబంధనలు కూడా ఎక్కడా కూడా అమలుకు నోచుకోవడంలేదు. 1వ తరగతి విద్యార్థులకు 6 కిలోలు, 2వ తరగతి విద్యార్థులకు 7కిలోలు, 3వ తరగతికి తొమ్మిది కిలోల బరువు ఈ విధంగా 10వ తరగతి విద్యార్థులకు సుమారు 25 కిలోల బరువుతో కూడిన పుస్తకాలు ఉంటున్నాయి.

అధిక బరువుతో ఆరోగ్యానికి ముప్పు....

విద్యార్థులు ప్రతి రోజూ మోసే బ్యాగుల అధిక బరువుతో వారి ఆరోగ్యానికి ముప్పు వాటిల్లనుంది. అధిక బరువు శారీరక ఎదుగుదలపై ప్రభావం చూపుతుంది. ఎముకలు, కండరాలు, మెడ, భుజాలు, వెన్నుపూసపై తీవ్ర ప్రభావం కనపడుతుంది. అంతేకాక విద్యార్థులు వంగిపోవడం జరుగుతుంది. దీని వలన శ్వాస కూడా సరిగా తీసుకోలేని పరిస్థితి నెలకొంటుంది.

భవిష్యత్‌లో వెన్నుపూసపై ప్రభావం



విద్యార్థులకు అధిక బరువుతో కూడిన బ్యాగులు ప్రమాదకరం. వారి వెన్నుపూసపై భవిష్యత్‌లో ప్రభావం పడుతుంది. విద్యార్థుల వయస్సుకు తగ్గట్టుగా బరువుఉండాలి. బ్యాగ్‌ల బరువు ఎక్కువగా ఉండడంతో పెరుగుదల ఆశించిన స్థాయిలో ఉండదు. అధికబరువుతో కూడిన బ్యాగులను వివిధ అంతస్తుల వరకు మోయడంతో మోకాళ్ల నొప్పులు భవిష్యత్‌లో వచ్చే అవకాశం ఉంటుంది.

● డాక్టర్ లకావత్ రమేష్‌నాయక్, అసోసియేట్ ప్రొఫెసర్, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూర్యాపేట.

ఎన్ఎస్‌జీలో ఆడనున్న బాలికల ఖోఖో జట్టు


క్లస్టర్-1లో ఖోఖో బాలికల విభాగంలో విజేతలుగా నిలిచిన నల్లగొండ కేంద్రీయ విద్యాలయ విద్యార్థినులు

నల్లగొండ, జూలై 2 : నల్లగొండ జిల్లా కేంద్రంలోని పీఎం కేంద్రీయ విద్యాలయ విద్యార్థులు అండర్-17 బాలికల విభాగంలో నేషనల్ స్కూల్ గేమ్స్(ఎన్ఎస్‌జీ)కి ఎంపికయ్యారు. మంగళవారం విద్యాలయ ప్రిన్సిపాల్ జీ శ్రీనివాసులు, ఖోఖో కోచ్ మధుబాబు వివరాలు వెల్లడించారు. నల్లగొండ కేంద్రీయ బాలికల ఖోఖో జట్టు విద్యార్థినులు హైదరాబాద్ క్లస్టర్-1లో కంచన్‌బాగ్, భువనగిరి ఎన్ఎఫ్‌సీ నలగర్, సీఆర్పీఎఫ్ బార్కాస్, మహబూబ్‌నగర్ జట్లపై గెలుపొందినట్లు తెలిపారు. అదేవిధంగా సెమీస్‌లో ఉప్పల్, ఫైనల్స్‌లో ఖమ్మం జట్లపై గెలుపొంది క్లస్టర్-1లో విజేతలుగా నిలిచారన్నారు. ఈ నెల 8, 9 తేదీల్లో విశాఖపట్నంలో నిర్వహించే ఎన్ఎస్‌జీ రీజనల్ స్థాయి స్పోర్ట్స్ మీట్‌లో బాలికల జట్టు పాల్గొంటుందన్నారు. క్లస్టర్ స్థాయిలో విజయం సాధించిన విద్యార్థినులను ప్రిన్సిపాల్, కోచ్‌లు అభినందించారు.

మాజీ సీఎం కేసీఆర్‌ను కలిసిన జడ్పీచైర్మన్ నరేందర్‌రెడ్డి


మాజీ సీఎం కేసీఆర్‌ను కలిసిన బండా నరేందర్‌రెడ్డి కుటుంబ సభ్యులు

నల్లగొండ, జూలై 2 : మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను మంగళవారం మెదక్ జిల్లా గజ్వేల్ సమీపంలోని ఎర్రవల్లిలోని ఫాంహౌస్‌లో నల్లగొండ జిల్లా పరిషత్ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి తన కుటుంబసభ్యులతో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ నెల 4వ తేదీతో జడ్పీ పాలకవర్గాల గడువు ముగుస్తున్న నేపథ్యంలో మాజీ సీఎం కేసీఆర్ పలు ప్రజాప్రతినిధులను సన్మానించారు. అదేవిధంగా కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు చిరుమర్తి లింగయ్య, పైళ్ల శేఖర్‌రెడ్డిలు ఉన్నారు. అదేవిధంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌ను పలువురు నేతలు కలిశారు. కార్యక్రమంలో మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డితో పాటు పలువురు నేతలు ఉన్నారు.

రాహుల్‌గాంధీపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు



పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేస్తున్న బీజేవైఎం నాయకులు

రామగిరి, జూలై 2 : కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్‌గాంధీ హిందువుల మనోభావాలు దెబ్బతినేలా మాట్లాడారని బీజేవైఎం నల్లగొండ జిల్లా అధ్యక్షుడు వంగూరి రాఖీ అధ్వర్యంలో మంగళవారం నల్లగొండ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాహుల్‌గాంధీ పార్లమెంట్ సాక్షిగా హిందువు అని చెప్పుకునేవారు హింసను ప్రోత్సహిస్తారని, అసత్యాన్ని మాట్లాడుతారని హిందువులపై అనుచిత వ్యాఖ్యాలు చేశాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మాటలు హిందూ సమాజాన్ని, హిందువుల మనోభావాలు దెబ్బతినేలా ఉన్నాయన్నారు. కాంగ్రెస్ విధానం హిందువులకు వ్యతిరేకమని స్పష్టంగా అర్థమవుతోందన్నారు. కార్యక్రమంలో బీజేవైఎం నాయకులు ఉన్నారు.

కొత్త చట్టాల ప్రకారం భువనగిరిలో మూడు కేసులు

భువనగిరి టౌన్, జూలై 2 : తాజాగా నుంచి అమల్లోకి వచ్చిన కొత్తచట్టాల ప్రకారం యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం మూడు కేసులు నమోదయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం భువనగిరిలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన పాలకవర్గం చివరి సమావేశానికి కాంగ్రెస్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న హాజరయ్యారు. ఈ మేరకు నిరుద్యోగం తదితర సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తూ బీజేపీ కార్యకర్తలు జడ్పీ కార్యాలయంలోకి దూసుకెళ్లి ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను అడ్డుకునే ప్రయత్నాలు చేశారు. ఈ మేరకు వచ్చిన ఫిర్యాదు మేరకు నూతన చట్టం 171 ప్రకారం బీజేపీ పట్టణ అధ్యక్షుడు రత్నపురం బలరాం, బీజేవైఎం అధ్యక్షుడు కానుకుంట్ల రమేష్, రావుల సంతోష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు. స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన సుధీర్‌కుమార్ ఇంటి ముందు నిలిపి ఉన్న బైక్ చోరీకి గురైంది. ఈ మేరకు బాధితుడి ఫిర్యాదు మేరకు నూతన చట్టం ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కె వీరస్వామి తెలిపారు. పట్టణ శివారులోని ఏజీఐ గ్లాస్ ఫ్యాక్టరీ వద్ద నిషేధిత గుట్కాలు విక్రయిస్తున్నట్లు సమాచారం మేరకు సంబంధిత దుకాణాల్లో తనిఖీలు చేశారు. ఈ మేరకు రూ.8వేల విలువైన గుట్కా ప్యాకెట్లు లభించాయి. దీంతో గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని విక్రయదారుడు కొత్త శేఖర్‌పై నూతన చట్టం 270 బీఎన్ఎస్, 275 బీఎన్ఎస్, 20-2 కోకో చట్టం ప్రకారం కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు. జూలై 1 నూతన చట్టాలు అమల్లోకి రాగా రెండో రోజైన మంగళవారం మూడు కేసులు నమోదయ్యాయి.

డీసీఎం, లారీ ఢీకొని ఐదు గేదెలు మృతి

మద్దిరాల, జూలై 2 : సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలం గోరెంట్లలో డీసీఎం లారీ ఢీకొని ఐదు గేదెలు మృతి చెందాయి. ఎస్ఐ మధునాయుడు తెలిపిన వివరాల ప్రకారం మహబూబాబాద్ జిల్లా మరిపెడబంగ్లా నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా డీసీఎంలో 22 గేదెలను హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. మార్గమధ్యలో మద్దిరాల మండలం గోరెంట్ల గ్రామశివారులో సూర్యాపేట నుంచి దంతాలపల్లికి వెళ్తున్న లారీ వెనక నుంచి డీసీఎంను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో డీసీఎంలో ఐదు గేదెలు అక్కడికక్కడే మృతి చెందాయి. 17 గేదెలను యాదాద్రిభువనగిరి జిల్లా రాజాపేట మండలం చల్లూరులోని గేదెల సంరక్షణ కేంద్రానికి తరలించినట్లు తెలిపారు. మృతి చెందిన గేదెలకు పశువైద్యాధికారి ఆసీఫా పరీక్షలను నిర్వహించి ఖననం చేయించారు. అక్రమంగా గేదెలను తరలిస్తున్న వారిపై, లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మధునాయుడు తెలిపారు.

నాలుగు క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

తిప్పర్తి, జూలై 2 : అక్రమంగా తరలిస్తున్న నాలుగు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని నల్లగొండ జిల్లా తిప్పర్తి పోలీసులు స్వాధీనం చేసుకుని, కేసు నమోదుచేశారు. ఎస్ఐ డీ రాజు తెలిపిన వివరాల ప్రకారం కేతేపల్లి మండల కేంద్రానికి చెందిన జాతంగి సైదులు తిప్పర్తి మండలంలోఓని పలు గ్రామాల్లో రేషన్ బియ్యాన్ని లబ్ధిదారుల నుంచి కొనుగోలు చేసి,మార్కెట్‌లో విక్రయిస్తున్నాడు. మంగళవారం మామిడాల గ్రామం నుంచి నాలుగు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని ఆటోలో నకిరేకల్ రోడ్డు వైపు తీసుకెళ్తుండగా పెట్రోలింగ్‌లో అటుగా వెళ్లిన పోలీసులు బియ్యాన్ని స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. సైదులుపై కేసు నమోదు చేసి బియ్యాన్ని సివిల్ సప్లయి విభాగానికి అప్పగించనున్నట్లు ఎస్ఐ రాజు తెలిపారు.

వేధింపులు తాళలేక యువతి ఆత్మహత్యాయత్నం

చివ్వెంల, జూలై 2 : యువకుడి వేధింపులు భరించలేక ఓ యువతి ఆత్మహత్యాయత్నం చేసింది. ఈ ఘటనలో యువకుడి సహా కుటుంబసభ్యులపై కేసు నమోదైంది. ఇదే కేసులో యువకుడి సోదరుడు, పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తున్న వ్యక్తిపైనా కేసు నమోదైంది. మంగళవారం పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సూర్యాపేట జిల్లా హుజుర్‌నగర్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతి ఐదేళ్ల కిందట తల్లిదండ్రులు అనారోగ్యంతో మృతిచెందడంతో చివ్వెంల మండలంలోని గుంజలూరు గ్రామంలో మేనమామ వద్ద ఐదేళ్లుగా ఉంటోంది. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన కొనకంచి మహేష్ యువతిని లోబర్చుకుని లైంగిక వేధింపులకు పాల్పడడంతో పాటు బెదిరించసాగాడు. దీంతో మనస్తాపానికి గురైన యువతి సోమవారం తెల్లవారుజామున క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. గమనించిన మేనమామ సూర్యాపేటలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఆయన ఫిర్యాదు మేరకు నిందితుడు మహేష్‌తో పాటు అతడి సోదరుడు తుల్జారావుపేట జూనియర్ గ్రామపంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న కొనకంచి అశోక్, ఆయన తల్లి, మరో సోదరుడు అనిల్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బీ వెంకటరెడ్డి తెలిపారు. ప్రస్తుతం యువతి ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు తెలిపారు.

రాజీకోసం రంగంలోకి నాయకులు

సోమవారం ఉదయం పోలీసులకు యువతి మేనమామ ఫిర్యాదు అందిస్తే, రాత్రి సమయంలో కేసు నమోదుచేశారు. కేసు నుంచి పంచాయతీ కార్యదర్శిని తొలగించాలని పోలీసులు యువతి బంధువులపై ఒత్తిడి చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ససేమిరా అనడంతో చేసేదేమీలేక పోలీసులు కేసు నమోదు చేసినట్లు సమాచారం. ఇదే కేసును పూర్తిగా రాజీకి తీసుకువచ్చేందుకు అదే గ్రామానికి చెందిన పలువురు, పలు పార్టీల కొందరు నాయకులు పోలీసుల సహకారంతో మంగళవారం ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు ప్రయత్నించారు.

ప్రయాణికుడి వద్ద నగదు చోరీ

చివ్వెంల, జూలై 2 : బస్సులో ప్రయాణికుడికి సంబంధించిన రూ.12 లక్షల నగదు చోరీకి గురైంది. మంగళవారం సూర్యాపేట జిల్లా చివ్వెంల ఎస్ఐ వెంకటరెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయవాడకు చెందిన కొల్లి శివకుమార్ రూ.12 లక్షలను హైదరాబాద్‌లోని కూకట్‌పల్లికి చెందిన ఫణి అనే వ్యక్తి వద్ద నుంచి జూన్ నెల 30న తీసుకున్నాడు. అదే రోజు రాత్రి ఓ ట్రావెల్ బస్సు ఎక్కి హైదరాబాద్ నుంచి విజయవాడకు బయలుదేరాడు. హైదరాబాద్-విజయవాడ జాతీయరహదారి పక్కన చివ్వెంల మండలం వల్లభాపురం వద్ద గల సాయి క్రిష్ణ హోటల్ వద్ద బస్సును సోమవారం తెల్లవారుజామున నాలుగు గంటల సమయంలో కాలకృత్యాల కోసం నిలిపారు. శివకుమార్ మూత్రవిసర్జనకు వెళ్లి వచ్చి బస్సు ఎక్కి బ్యాగును చూడగా అందులోని నగదు కనిపించలేదు. దీంతో చేసేదేమిలేక స్థానిక చివ్వెంల పోలీసులకు శివకుమార్ ఫిర్యాదుచేశాడు. ఆ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటరెడ్డి తెలిపారు. బస్సులో ప్రయాణించిన వారిలో అనుమానస్పద వ్యక్తుల వివరాలు సేకరించి, పోలీసులు విచారణ చేస్తున్నట్లు సమాచారం.

మట్టి టిప్పర్లను అడ్డుకున్న స్థానికులు

చింతపల్లి, జూలై 2 : నల్లగొండ జిల్లా చింతపల్లి మండలం ఘడియగౌరారంలో ఒండ్రుమట్టిని తరలిస్తుండగా మంగళవారం స్థానికులు అడ్డుకున్నారు. టిప్పర్ల ద్వారా ఉప్పరపల్లి, తిరుమలాపురం మీదుగా మట్టిని తరలిస్తుండగా పక్కా సమాచారంతో నసర్లపల్లి గేట్ సమీపంలో అడ్డుకున్నారు. అధికలోడ్‌తో టిప్పర్లు ప్రయాణించడంతో బీటీ రహదారులు పూర్తిగా ధ్వంసమై గుంతలమయంగా తయారవుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులు చొరవ తీసుకుని ఒండ్రుమట్టి అక్రమ రవాణాను అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు.

గుట్టలో గంజాయి పట్టివేత

యాదగిరిగుట్ట రూరల్, జూలై 2: యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్టలో పోలీసులు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సీఐ రమేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సోమవారం పట్టణంలో సాధారణ వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో తనిఖీల్లో భాగంగా ఆటోలో ప్రయాణిస్తున్న వడ్లకొండ నరేష్, కే సిద్ధులు వద్ద 35 గ్రాముల గంజాయి లభ్యమైందని, వారిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

రూ.కోట్ల విలువైన ప్రభుత్వ భూమి కబ్జా

- కంపసాగర్‌లో 32 ఎకరాల ఆక్రమణ
- కబ్జా భూమి విలువ సుమారు రూ.10 కోట్లు
- పట్టించుకోని యంత్రాంగం



కంపసాగర్‌లో కబ్జాకు గురైన బండకుంట, ప్రభుత్వ భూమి



త్రిపురారం, జూలై 2 : ఒకటి ఊరకుంట, మరొకటి పశువులు మేసే ప్రభుత్వ భూమి ఊరందరికీ ఉపకారిగా ఉండే ఈ స్థలాలపై కొందరు కన్నేశారు. సర్కారు భూమే కదా ఎవరూ పట్టించుకుంటారులే అనుకున్నారు. దర్జాగా కబ్జా చేశారు. ఈ భూమి విలువ సుమారు రూ.10 కోట్ల వరకు ఉంటుంది. అయినా ఇప్పటివరకు ఏ యంత్రాంగం అటువైపు కన్నెత్తి చూడలేదు. దాంతో ఆక్రమణదారులకు అడ్డే లేకుండాపోయింది. నల్లగొండ జిల్లా త్రిపురారం మండలం కంపసాగర్ గ్రామపంచాయతీ పరిధిలోని సర్వే నెంబర్ 8లోని రెండు ఎకరాల ఐదు గుంటల విస్తీర్ణంలో బండకుంట ఉంది. గ్రామానికి సమీపంలో ఉండటంతో ఒకప్పుడు ఈ కుంట ప్రజల అవసరాల తీర్చేలా ఉండేది. అదేగ్రామానికి చెందిన ఓ కుటుంబానికి చెందిన నలుగురు అన్నదమ్ములు కొన్నేళ్ల కిందట కుంటను చెరపట్టారు. ఉన్న కొద్ది పాటి కుంటను పూర్తిగా తమ ఆధీనంలోకి తీసుకున్నారు. వారిస్తున్నా అంగబలంతో ఘర్షణలకు దిగుతున్నట్లు గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా రాజకీయ పలుకుబడితో ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నట్లు సమాచారం. ఈ మధ్య కాలంలో కుంటను ఇళ్ల ప్లాట్లుగా మార్చి విక్రయాలు చేపడుతున్నారు. ఇద్దరు వ్యక్తులకు సుమారు ఆరు గుంటలను లక్షల రూపాయలకు విక్రయించినట్లు గ్రామస్థులు చెబుతున్నారు. బండకుంట స్థలం విలువ రూ.కోటి వరకు ఉంటుందని అంచనా.. సదరు కుంట స్థలం కొనుగోలు చేసిన వ్యక్తులు ఇళ్లు కట్టుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు గ్రామస్థులు వాపోతున్నారు. కుంటను కబ్జాదారుల చెర నుంచి విడిపించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

ప్రభుత్వ స్థలాలకు ఇదే దుస్థితి

కంపసాగర్ గ్రామం నుంచి పశువులు మేసే ప్రభుత్వ భూమి (ఏనె గుట్ట) సర్వే నెంబర్ 12/5/1లోని 26 ఎకరాల 10 గుంటల్లో సుమారు కిలోమీటరు పరిధిలో విస్తరించింది. భూమికి ఇరువైపులా పట్టా ఉన్న రైతులు ప్రభుత్వ భూమిని ఆక్రమించేశారు. సుమారు 20 ఎకరాల మేర పూర్తిగా కబ్జా చేసి పంటలు పండించుకుంటున్నారు. కేవలం నల్ల రాళ్లు ఉండి చదునుకు పనికి రాని భూమిని మాత్రమే ప్రస్తుతం ఆక్రమణలు పోగా మిగిలి ఉన్నట్లు సమాచారం. ఆ ప్రాంతంలో ఎకరం విలువ సుమారు రూ.30లక్షల వరకు ఉంటుంది. 20 ఎకరాలకు రూ.6 కోట్ల విలువ ఉంటుందని అంచనా. ఇదేపంచాయతీ పరిధిలోని కోమటిగూడెం గ్రామం పక్కన ఉన్న 275 సర్వే నెంబర్‌లోని 18 ఎకరాల 36 గుంటల ప్రభుత్వ భూమిలో సుమారు 10 ఎకరాలను చుట్టు ప్రక్కన ఉన్న రైతులు ఆక్రమించి పొలాలుగా మార్చి పంటలు సాగు చేస్తున్నారు. ఈ భూమి విలువ సుమారు రూ.3కోట్లు వరకు ఉంటుందని గ్రామస్థులు చెబుతున్నారు. ఇదే సర్వే నెంబరులోని ఎకరం స్థలంలో ఐదు దశాబ్దాలుగా శ్మశానవాటిక ఉండేది. ఐదేళ్ల కిందట కొందరు ఈ శ్మశానాన్ని కబ్జా చేశారు. గత ఏడాది ఒక వ్యక్తి చనిపోగా ఖననం చేయడానికి శ్మశానానికి తీసుకువెళ్లారు. ఆ సమయంలో ఆక్రమణదారులు అడ్డుకున్నారు. గ్రామస్థులకు కబ్జాదారులకు తీవ్ర ఘర్షణ చోటుచేసుకుంది. సమస్య పరిష్కారం కాకపోవడంతో పోలీస్‌స్టేషన్ ఎదుట గ్రామస్థులు ధర్నా చేశారు. సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన అధికారులు ఇప్పటివరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ఇప్పటికీ శ్మశానం పూర్తిగా కబ్జాదారుల చేతిలో ఉండింది. గ్రామంలోని బండ కుంటను, కబ్జాకు గురైన ప్రభుత్వ భూములను పూర్తిస్థాయిలో సర్వే నిర్వహించి హద్దులు ఏర్పాటు చేయాలని కంపసాగర్ గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

మా దృష్టికి రాలేదు..

కంపసాగర్‌లోని బండకుంట, ప్రభుత్వస్థలాల కబ్జా విషయం మా దృష్టికి రాలేదు.

- ప్రమీల, తహసీల్దార్, త్రిపురారం

శ్మశానాన్ని వదలలేదు

కోమటిగూడెంలోని ఎకరం స్థలంలో ఉన్న శ్మశానాన్ని కబ్జాచేశారు. ఎవరైనా చనిపోతే ఎక్కడ ఖననం చేయలో అర్థం కాని దుస్థితి. మండల అధికారులకు, కలెక్టరకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదు.కంపసాగర్‌లోని విలువైన ప్రభుత్వ భూములు, గుంటల భూమిని కొందరు కబ్జా చేసి పంటలు సాగు చేస్తున్నారు. ఊరి అవసరాలకు ఉపయోగపడే స్థలా ల ఆక్రమణపై అధికారులు దృష్టి సారించాలి. ప్రభుత్వ భూములను పూర్తిగా సర్వే చేసి హద్దులు ఏర్పాటుచేయాలి.



- బూర మధు, కోమటిగూడెం

గుట్టలో లక్ష్మీసమేతుడికి లక్ష పుష్పార్చన



ప్రధానాలయంలో స్వామివారికి లక్ష పుష్పార్చన నిర్వహిస్తున్న అర్చకులు

భువనగిరి అర్బన్, జూలై 2 : యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మంగళవారం ఏకాదశి పూజలు వైభవంగా చేపట్టారు. సుప్రభాత సేవతో స్వయంభువులను మేల్కొల్పిన పూజారులు గర్భాలయంలో కొలువుదీరిన స్వామిఅమ్మవార్లను మంగళవాయిద్యాల నడుమ పంచామృతాలు, తులసీ దళాలతో అర్చించారు. స్వామిఅమ్మవార్ల సహస్రనామార్చనలను పఠిస్తూ లక్ష పుష్పార్చన శాస్త్రోక్తంగా చేపట్టారు. స్వామివారి సన్నిధిలో కొలువుదీరిన క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామికి నాగవల్లీ దళార్చనలు, స్వామికి నిత్యపూజలు శాస్త్రోక్తంగా జరిగాయి. కొండపైన విష్ణుపుష్కరిణి చెంత ఆంజనేయస్వామిని వేదమంత్రాలతో పంచామృతాభిషేకం జరిపారు. ఆంజనేయుడికి సహస్రనామ పఠనాలతో నాగవలీ దళార్చనలు చేపట్టారు. ప్రధానాలయంలోని స్వయంభూలను సుప్రభాత సేవతో మేల్కొలిపి నిజాభిషేకం, నిత్యార్చనలు, ముఖమండపంలో సుదర్శన నారసింహహోమం, నిత్యతిరుకల్యాణోత్సవ పర్వాలను పాంచరాత్రాగమశాస్త్రరీతిలో నిర్వహించారు. కొండపైన అనుబంధ శివాలయంలో శ్రీ పర్వతవర్ధిని సమేతా రామలింగేశ్వరస్వామికి ముఖమండపంలోని స్పటికమూర్తులకు నిత్యపూజలు, నిత్య రుద్రహవనం శైవగామ పద్ధతిలో కొనసాగాయి. అనుబంధ పాతగుట్ట ఆలయం, విష్ణుపుష్కరిణి, కొండపైన శివాలయంలోని ఆంజనేయస్వామిని ఆరాధిస్తూ అర్చకులు ప్రత్యేకపూజలు చేపట్టారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ. 19,21,613 ఆదాయం సమకూరినట్లు ఈవో ఏ. భాస్కర్‌రావు తెలిపారు.

ఆలయ ఉత్తర దిశలో షెడ్డు తొలగింపు

గుట్ట ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా కొండపైన ఆలయం, అవసరమైన కార్యాలయాలు మినహా ఎలాంటి నిర్మాణాలు చేపట్టలేదు. 2022 మార్చి 28న ఉద్ఘాటన నిర్వహించగా అప్పటినుంచి దర్శించుకునేందుకు పెద్దసంఖ్యలో భక్తులు తరలివస్తున్నారు. ఎండా,వానలకు తలదాచుకునేందుకు కొండపైన భక్తులు ఇబ్బందులు పడుతుండటంతో ఈ ఏడాది మార్చి చివరలో ఆలయ ఉత్తర దిశలోని తిరుమాడ వీధిలో దాతల సహకారంతో జర్మన్ టెక్నాలజీ హ్యాంగర్ ఫ్యాబ్రిక్‌తో షెడ్డు అందుబాటులోకి తెచ్చి భక్తులకు నీడ కల్పించారు. దీని కిందనే గడిచిన ఎండాకాలం మొత్తం భక్తులు సేదతీరారు. ప్రస్తుతం షెడ్డు తొలగించడంతో వర్షాకాలం ఎలా అన్న ప్రశ్న తలెత్తుతోంది. కాగా, ఈ షెడ్డు భారీ ఎత్తులో బిగించగా ఆలయ సహజత్వానికి అడ్డుగా మారింది. ఇది బిగించే సమయంలో తూర్పు, పశ్చిమ, దక్షిణ దిశలో కూడా ఏర్పాటు చేయాలని యోచించారు. అయితే షెడ్డు ఏమేరకు ఉపయోగపడుతోంది? ఏ రకమైన ఇబ్బందులు తలెత్తుతున్నాయో అని కొద్ది రోజులు అధికారులు పరిశీలించారు. ఇదే షెడ్డు కింద ఈ నెల 27 నుంచి 30 వరకు శ్రీ వినాయక నాట్య మండలి(సురభి) నాటక ప్రదర్శనలు ఇచ్చేందుకు ఒక వేదికను ఏర్పాటుచేశారు. ప్రదర్శనలు ముగియడంతో వేదికతో పాటు షెడ్డును కూడా పూర్తిగా తొలగించారు. ఈ షెడ్డు కింద అధికసంఖ్యలో ఎండా, వానలకు భక్తులు సేద తీరారు. ప్రస్తుతం షెడ్డు తొలగించడంతో భక్తులకు రక్షణ కరువైంది.





ఉత్తర దిశలో ఏర్పాటుచేసిన భారీ షెడ్డు (ఫైల్), షెడ్డు తొలగించిన తర్వాత తిరుమాఢ వీధి

ఆలిండియా ర్యాంకర్ ఆర్థికసాయం కోసం ఎదురుచూపు



కుంచం శివ

మిర్యాలగూడటౌన్, జూలై 2 : జాతీయ స్థాయి ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్షలో ఆలిండియా ర్యాంక్ సాధించిన విద్యార్థి ఆర్థిక సాయం కోసం ఎదురుచూస్తున్నాడు. జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ఆలిండియా 211వ ర్యాంకు, ఓబీసీ కేటగిరిలో 24వ ర్యాంకు సాధించిన నల్లగొండ మిర్యాలగూడ పట్టణ విద్యార్థి కుంచం శివ ఆర్థికసాయం కోసం ఎదురుచూస్తున్నాడు. ఉత్తమ ర్యాంకు సాధించిన శివకు ముంబై ఐఐటీ(కంప్యూటర్ సైన్స్)లో ప్రవేశం లభించింది. చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయిన శివను వ్యవసాయ కూలీ అయిన నానమ్మ రాములమ్మ అండగా నిలిచి చదివించింది. కాగా ఆదిత్య పాఠశాల కరస్పాండెంట్ మారుతి అమరేందర్ రెడ్డి పదో తరగతి వరకూ ఉచిత విద్యను అందించగా 10/10 గ్రేడ్ సాధించాడు. నారాయణ జూనియర్ కళాశాల యాజమాన్యం ఉచిత ప్రవేశం కల్పించడంతో పట్టుదలతో చదివి 940 మార్కులు సాధించాడు. అయితే ప్రస్తుతం జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ర్యాంక్ సాధించి ప్రతిష్టాత్మక ఐఐటీ(ముంబై)లో ప్రవేశం పొందాడు.

ఆర్థిక ఇబ్బందులతో అవస్థలు

ప్రతిష్టాత్మక ముంబై ఐఐటీలో ప్రవేశంపొందిన శివ ఈ నెల 25న అక్కడ ప్రవేశం పొందాల్సి ఉంది. అయితే కనీస ఖర్చులు కూడా భరించలేని పేదరికంలో ఉన్న శివ ఆర్థికఇబ్బందులతో ముంబైకి కూడా వెళ్లలేని పరిస్థితిలో ఉన్నాడు. తన ఉన్నత చదువుల కోసం ఆర్థికసాయం కావాలని కోరాడు.

దాతలు ఆర్థికసాయం అందించాల్సిన వివరాలు

బ్యాంక్ ఆఫ్ బరోడా, మిర్యాలగూడ శాఖ,
ఖాతా నెంబర్ 49628100018208
ఐఎఫ్‌సీఐ కోడ్ : BARBOMIRYAL
ఫోన్ నెంబరు : 9182871768

లేని తేదీని సృష్టించి పట్టామార్పిడి

- 2018లో ఫిబ్రవరి 29న క్రమబద్ధీకరణ
- లీఫ్ సంవత్సరం కాకపోవడంతో అధికారుల అక్రమాలు వెలుగులోకి
- లేని తేదీతో సాదాబైనామా క్రమబద్ధీకరణ

నల్లగొండ టౌన్, జూలై 2 : ఒకరు భూమిని మరొకరు ఆక్రమించి, తప్పుడు రిజిస్ట్రేషన్ చేస్తుంటారు, కానీ ఏకంగా ఆ సంవత్సరంలో లేని తేదీనే సృష్టించి సాదాబైనా క్రమబద్ధీకరణ పేరుతో పట్టా మార్పిడి చేశారు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా మునుగోడు మండలంలో చోటుచేసుకోగా, బాధితుడి ఫిర్యాదుతో కేసులు నమోదు చేసినా అతడి మాత్రం న్యాయం జరుగలేదు. దీంతో ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్, ఎస్పీలను బాధితుడు ఆశ్రయించాడు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.

మునుగోడు మండలం కల్వకుంట్ల గ్రామానికి చెందిన మేక పురుషోత్తంరెడ్డి గ్రామంలోని ఖాతా నెంబరు 126 ద్వారా టీ28180180085 పాస్‌బుక్ కలిగి ఉన్నాడు. సర్వేనెంబర్ 8, 9, 13, 40లలో 0.30 గుంటల భూమి ఆయనకు ఉంది. ఈ భూమికి సంబంధించిన అన్నిహక్కులను 2020 వరకు కలిగి ఉన్నాడు. అయితే ఈ భూమిపై కన్నెసిక కొందరు రెవెన్యూ అధికారులతో కలిసి 2018లో ఫిబ్రవరి 29న సాదాబైనామా క్రమబద్ధీకరణ పేరిట నకిలీ పత్రాలు 13-బీ సృష్టించి పట్టా మార్పిడిచేశారు. అయితే విషయం తెలుసుకున్న బాధితుడు స్థానిక తహసీల్దార్, ఇతర రెవెన్యూ అధికారులను నిలదీసినా పొంతన లేని సమాధానం వచ్చింది. అదీకాకుండా పట్టా మార్పిడి విషయంలో 2018 ఫిబ్రవరి 13వ తేదీన విచారణకు హాజరు కావాల్సిందిగా పేర్కొంటూ అదే నెల 29న లేఖ ఇచ్చినట్లు అధికారులు సృష్టించారు. ఇదిలా ఉండగా ప్రతీ నాలుగేళ్లకు ఒకసారి వచ్చే లీఫ్ సంవత్సరం 2018లో రాలేదు. ఆ సంవత్సరంలో ఫిబ్రవరి 28వ తేదీతోనే ముగిసింది. అయితే దీనిని పట్టించుకోని అధికారులు తమకు తోచిన తేదీలు వేసి పట్టా మార్పిడి చేశారు. అదేవిధంగా 2016లో ప్రభుత్వం జారీ చేసిన జీవో 153 ప్రకారం ఐదు ఎకరాలు, ఆపైన భూమి ఉన్న వారికి సాదాబైనామా కింద ఆర్‌వోఆర్ పట్టా ఇవ్వకూడదు. అలాంటి వారు సాదాబైనా క్రమబద్ధీకరణ కోసం ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. కానీ, నిబంధనలకు విరుద్ధంగా మాన్యువల్ పద్ధతిలో దరఖాస్తు రెవెన్యూ అధికారులు స్వీకరించారు. ఏడు ఎకరాలకు పైగా ఉన్న వ్యక్తికి భూమిని బదలాయించారు. దీంతో 2021లో సదరు వ్యక్తులకు పట్టా పాస్‌పుస్తకం వచ్చింది. దీంతో బాధితుడికి విషయం తెలిసింది. సదరు బాధితుడు తనకు జరిగిన అన్యాయంపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ పేరిట కాలయాపన చేశారు.

అంతేతప్ప ఎవరిపైనా చర్యలు తీసుకోలేదు. దీంతో విసిగివేసారిన బాధితుడు చివరకు నల్లగొండ జిల్లా కలెక్టర్ సీ నారాయణరెడ్డి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్‌లను ఆశ్రయించాడు. అక్రమాలకు పాల్పడిన వ్యక్తులు, అధికారులు, పోలీసుపై చర్యలు తీసుకోవాలని కోరాడు.



డిండిలో మంత్రి సీతక్కకు సన్మానిస్తున్న కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు

మంత్రి సీతక్కకు స్వాగతం

డిండి, జూలై 2: మంత్రి సీతక్కకు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నల్లగొండ జిల్లా డిండి మండలకేంద్రంలో మంగళవారం ఘనస్వాగతం పలికారు. నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్‌కు వెళ్తున్న సీతక్క డిండి మండల కేంద్రంలోని రాజీవ్‌గాంధీ విగ్రహనికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎనిమిది నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికులు మంత్రికి వినతిపత్రం అందజేశారు. జీవో 51ని రద్దు చేయాలని, మల్టీపర్పస్ విధానం రద్దు చేసి వేతనాలు పెంచాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బాదమోని శ్రీనివాస్‌గౌడ్, పున్న దినేష్, వెంకటేష్, మూడావత్ భీముడు, కయూం, ఈశ్వర్, మల్లేష్, సురేష్, వేణు, అబ్దుల్ ఖాదర్ తదితరులు ఉన్నారు.

ప్రమాదపుటంచున ప్రయాణం

- దెబ్బతిన్న కల్వర్టులు, ప్రయాణానికి ఇబ్బందులు





దూదివెంకటపూర్- సోమారం గ్రామాల కొట్టుకుపోయిన కల్వర్టు, వాగుపై ధ్వంసమైన కాజ్‌వే

రాజాపేట, జూలై 2 : గత ఏడాది కురిసిన భారీ వర్షాలకు యాదాద్రిభువనగిరి జిల్లా రాజాపేట మండలంలోని రోడ్లు, కల్వర్టులు, కాజ్‌వేలు దెబ్బతిన్నాయి. బేగంపేట, దూదివెంకటపూర్, కాల్వపల్లి, పారుపల్లి వాగులపై ఉన్న కాజ్‌వేలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. కుర్రారం- దూదివెంటపూర్ గ్రామాల్లోని వాగులపై నిర్మించిన కల్వర్టుల కింద మట్టి కొట్టుకుపోవడంతో ప్రమాదకరంగా మారాయి. పారుపల్లి వాగుపై కాజ్‌వే తాత్కాలికంగా కల్వర్టు నిర్మించగా ఎప్పుడు కొట్టుకుపోతుందని తెలియని పరిస్థితి నెలకొంది. కాల్వపల్లి వాగుపై రోడ్డు బ్రిడ్జిని నిర్మాణానికి రూ.400 కోట్లు, బేగంపేట వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి రూ.9.50 కోట్లు, పారుపల్లి వాగు రోడ్డు బ్రిడ్జి నిర్మాణానికి రూ.12.6 కోట్లు నిధుల మంజూరు కాగా గత ఏడాది అప్పటి ఎమ్మెల్యే సునీతామహేందర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. కాగా బేగంపేట బ్రిడ్జి నిర్మాణం పనులు జరుగుతుండగా పారుపల్లి -కాల్వపల్లి వాగులపై నిర్మాణ పనులు ఇప్పటికీ నోచుకోలేదు. వర్షాకాలం ప్రారంభమైన పనులు మొదలు కాకపోవడం, దెబ్బతిన్న కల్వర్టు మరమ్మతులు చేపట్టకపోవడం ప్రయాణికులకు ఇబ్బందిగా మారింది. నిధులు మంజూరు చేసి మరమ్మతులు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

పనులు వేగంగా చేపట్టాలి



రాజాపేట-బొందుగుల గ్రామాల మధ్య పారుపల్లి వాగుపై ఉన్న కాజ్‌వే కొట్టుపోవడంతో ఇబ్బందిగా మారింది. నిధులు మంజూరై శంకుస్థాపన చేసి ఏడాది గడుస్తున్నా పనులు ప్రారంభించలేదు. దెబ్బతిన్న కల్వర్టులు, కాజ్‌వేలతో ప్రయాణం అంటే ప్రమాదంగా మారింది. ఈ పనులను వేగవంతంగా పూర్తి చేయాలి.

- పుట్ట వీరయ్య, గ్రామస్థుడు, బొందుగుల



నందాపురం- అనతంతారం గ్రామాల మధ్య అసంపూర్తిగా ఉన్న బ్రిడ్జి నిర్మాణం

అసంపూర్తి వంతెనతో ఇబ్బందులు

తిరుమలగిరి, జూలై 2 : సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండలం అనంతారం-నందాపురం గ్రామాల మధ్య వాగుపై అసంపూర్తి బ్రిడ్జితో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక వాగుపై కొన్నాళ్ల కిందట బ్రిడ్జి నిర్మాణాన్ని ప్రారంభించారు. వానాకాలం వచ్చినా నిర్మాణం పూర్తికాకపోవడంతో రెండు గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. విత్తనాలు, నాట్ల సీజన్ కావడం వల్ల రెండు గ్రామాల రైతులు ట్రాక్టర్లు, ఎడ్లబండ్లపై విత్తనాలు, ఎరువులు, తీసుకెళ్లడానికి తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.బ్రిడ్జి పక్కనే తాత్కాలికంగా ఏర్పాటుచేసిన బాటలో వర్షపు నీరు నిలవడంతో వాహనాలు గుంతల్లో వాహనాలు దిగబడుతున్నాయని వాపోతున్నారు. బ్రిడ్జి స్లాబ్‌భాగం పూర్తయ్యిందని రెండు వైపులా(రెయిలింగ్) గోడ నిర్మించి, మట్టిని పోసి చదును చేస్తే నిర్మాణం పూర్తి అవుతుందంటున్నారు. వానాకాలం నేపథ్యంలో త్వరగా నిర్మాణం పూర్తి చేయాలని రైతులు కోరుతున్నారు.

గిరిజన ముద్దుబిడ్డ, దేవరకొండ శాసనసభ్యులు శ్రీ నేనావత్ బాలునాయక్ గారికి జన్మదిన శుభాకాంక్షలతో....

Advt Feature

ప్రజలకు అందుబాటులో ఉండాలి

● దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్



దేవరకొండ: మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ, జూలై 2: ప్రజలకు అందుబాటులో ఉండి గ్రామాల అభివృద్ధికి కృషి చేసే ప్రజా ప్రతినిధులకు ప్రజలలో గుర్తింపు ఉంటుందని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. దేవరకొండలో మంగళవారం జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం విద్య, వైద్యం, సాగునీటి ప్రాజెక్టులపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తుందన్నారు. ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొంటానన్నారు. ప్రజా ప్రతినిధుల స్థానంలో అధికారులే బాధ్యత వహించాలని అన్నారు. అనంతరం పదవి కాలం పూర్తయిన సందర్భంగా ప్రజా ప్రతినిధులు, ఎంపీపీ, జడ్పీటీసీలను ఘనంగా సన్మానించారు. దేవరకొండ ఎంపీపీ నల్లగాసు జాన్‌యాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎంపీడీవో సుదర్శన్‌రెడ్డి, తహసీల్దార్ సంతోష్‌కిరణ్, వైస్‌ఎంపీపీ సుభాష్‌గౌడ్, జడ్పీటీసీ మారేపాకల అరుణ సురేష్‌గౌడ్, మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యేను సన్మానించారు.

చందంపేటను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా

చందంపేట : చందంపేట మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. మండలంలో విద్య, తాగునీరు, విద్యుత్, వైద్యం, వ్యవసాయ రంగాలకు ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఐదు సంవత్సరాలు పదవికాలం పూర్తి చేసుకున్న ఎంపీపీ, జడ్పీటీసీ, వైస్‌ఎంపీపీ, ఎంపీటీసీ సభ్యులకు అభినందలు తెలిపి సన్మానించారు. ప్రజలకు సేవ చేసేవారిని ప్రజలు ఎప్పుడు గుర్తుంచుకుంటారని అన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మీ, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీపీ పార్వతి, జడ్పీటీసీ బుజ్జి, పీఏసీఎస్ చైర్మన్ జాల నర్సింహరెడ్డి, మండల అధ్యక్షుడు బద్యనాయక్, అధికారులు పాల్గొన్నారు.

ఎంపీపీ, జడ్పీటీసీని సన్మానించిన ఎమ్మెల్యే



చింతపల్లి: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కొండూరి పవన్ కుమార్, జడ్పీటీసీ కంకణాల ప్రవీణ వెంకట్‌రెడ్డిలతో పాటు సభ్యులను మంగళవారం ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ సన్మానించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ....ప్రజలకు సేవ చేస్తే తిరిగి వారు ఓట్ల రూపంలో ప్రజా క్షేత్రంలో అవకాశం కల్పిస్తారని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు.

మరిన్ని జిల్లా వార్తల కోసం..
ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/GAcjufVలో చదవండి.
























ఆనంద్, పద్మ దంపతులకు కీర్తిరత్న అవార్డు



అవార్డు అందుకుంటున్న ఆనంద్, పద్మ దంపతులు

శాలిగౌరారం, జూలై 2: మండలంలోని ఆకారం గ్రామానికి చెందిన సామాజిక సేవకులు, సేవారత్న సుంకరి ఆనంద్, పద్మ దంపతులకు మలేషియాలోని తెలుగు అకాడమీ ఉగాది కీర్తిరత్న అవార్డుతో సత్కరించింది. అనాథలైన మానసిక దివ్యాంగులను గుర్తించి సుంకరి, ఆనంద్ దంపతులు పునరావాస కేంద్రంలో చేర్పించి మరో జన్మనిచ్చారని తెలుగు అసోసియేషన్ ఆఫ్ మలేసియా అధ్యక్షుడు డాక్టర్ ప్రతాప్ కొనియాడారు. అవార్డు గ్రహీతలను మహిళా అధ్యక్షురాలు కౌశల్య జువల్, ఫెడరేషన్ అసోసియేషన్ అంతర్జాతీయ అధ్యక్షుడు ఎంజేఆర్ వరప్రసాద్, టీఏఎం పూర్వ అధ్యక్షుడు అశోక్‌కుమార్, బూరెడ్డి మోహన్‌రెడ్డి అభినందించారు.

పత్తి, వరి పంటల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

కేతేపల్లి, జూలై 2: పత్తి, వరి పంటల్లో సస్యరక్షణకు ప్రస్తుతం అనుకూలంగా ఉందని మండల వ్యవసాయ అధికారి బి.పురుషోత్తం తెలిపారు. వానాకాలంలో మండలంలోని బండపాలెం గ్రామంలో రైతులు సాగు చేసిన పత్తి, వరి పంటలను మంగళవారం పరిశీలించారు. ఎరువులు, క్రిమిసంహారక మందుల వినియోగంలో మెళకువలు పాటించాలన్నారు. పంటల్లో కలుపు నివారణకు అంతర్ కృషి మేలని సూచించారు. తప్పనిసరి పరిస్థితుల్లోనే కలుపు మందులు పిచికారీ చేయాలన్నారు. నిర్దేశించిన మేరకు నత్రజని, పొటాష్ ఎరువులను నాలుగు సమభాగాలుగా చేసి పంట విత్తిన 20, 40, 60, 80రోజులకు వేయాలన్నారు. ఆయన వెంట రైతులు సైదిరెడ్డి, రూబెన్, లింగయ్య, శివ ఉన్నారు.

జాబ్ క్యాలెండర్ ప్రకటించాలి : డీవైఎఫ్ఐ



మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ నాయకులు

చిట్యాల, జూలై 2: రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జాబ్ క్యాలెండర్ ప్రకటించాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లం మహేష్ డిమాండ్ చేశారు. చిట్యాలలో మంగళవారం జరిగిన సంఘం సమావేశంలో మాట్లాడారు. మెగా డీఎస్సీ, గ్రూప్స్ నోటిఫికేషన్ విడుదల చేయాలన్నారు. ఉద్యోగాలు భర్తీ చేయకపోవడంతో గత ప్రభుత్వం కూలిపోయిందన్నారు. ఉద్యోగాలు భర్తీ చేయకుంటే ప్రస్తుత ప్రభుత్వానికీ గుణపాఠం తప్పదన్నారు. కార్యక్రమంలో నాయకులు జిట్ట రమేష్, వడ్డగాని మహేష్, అవిశెట్టి కిరణ్, సురేష్, దినేష్ పాల్గొన్నారు.

అనుమతి లేని కళాశాలలపై చర్యలు తీసుకోవాలి

దేవరకొండ, జూలై 2: అనుమతులు లేకుండా నడుస్తున్న ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు యలమల గోపిచంద్ డిమాండ్ చేశారు. ఆర్డీవో కార్యాలయ అధికారికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. దేవరకొండ, కొండమల్లేపల్లిలలో కళాశాలలు ప్రభుత్వ అనుమతిలేకుండా నడుస్తున్నాయన్నారు. అధికారులు విచారణ చేసి వారిపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఏబీవీపీ నాయకులు సైదులు, పవన్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

డిండి: డిండి మండలకేంద్రంలోని మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం పాఠశాల ఎదుట ధర్నా నిర్వహించారు. పాఠశాలలో అక్రమాలు జరిగాయని ఆరోపించారు. పాఠశాలపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వలమాల అంజనేయులు, బుడిగ వెంకటేష్, బొడ్డుపల్లి కృష్ణ, వినయ్, భాను ఉన్నారు.

పీహెచ్‌సీల్లో సిబ్బంది కొరత తీర్చాలి



వైద్యాధికారితో మాట్లాడుతున్న ఐద్వా సభ్యులు

నార్కట్‌పల్లి, జూలై 2: ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సిబ్బంది కొరత తీర్చాలని ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు ప్రభావతి డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో నార్కట్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం సందర్శించి సర్వే నిర్వహించారు. రెండేళ్లుగా ఆరోగ్య కేంద్రాలకు ప్రభుత్వం నుంచి మెయింటనెన్స్ నిధులు రాకపోవడంతో కనీస సౌకర్యాలు కొరవడ్డాయన్నారు. స్వీపర్లు, వాచ్‌మన్లు లేక ఆలనాపాలనా లేదన్నారు. రోగులకు అవసరమైన అన్ని రకాల మందులు సరఫరా కావడం లేదని గుర్తించామన్నారు. డాక్టర్లు, సిబ్బంది సమయ పాలన పాటించి మెరుగైన వైద్య సేవందించాలన్నారు. కార్యక్రమంలో జిట్ట సరోజ, జాల యాదమ్మ, సుకన్య, రుక్కమ్మ పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్లు పంపిణీ చేయాలి

నార్కట్‌పల్లి, జూలై 2: మండలంలోని ఔరవాణి, బీ.వెల్లెంల గ్రామాల్లో నిర్మాణం పూర్తైన డబుల్ బెడ్‌రూంలను అర్హులైన వారికి వెంటనే పంపిణీ చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు శ్రీరామోజు వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి చెర్కు పెద్దులు డిమాండ్ చేశారు. నార్కట్‌పల్లిలో మంగళవారం సమావేశంలో మాట్లాడారు. మిషన్ భగీరథ నీళ్లను ఇంటింటికీ సరఫరా చేయాలని, కొత్తగా రేషన్‌కార్డులు, పెన్షన్లు మంజూరు చేయాలన్నారు. అర్హత ఉన్న వినియోగదారులకు గృహజ్యోతి పథకం వర్తింపజేయాలని కోరారు. సమావేశంలో వైస్‌ఎంపీపీ కల్లూరి యాదగిరి, చింతపల్లి బయ్యన్న, దండు రవి, అర్థం శ్రీను, ఐతరాజు నర్సింహ్మా, యాదగిరిరెడ్డి, దండు నాగరాజు, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్ ర్యాంకర్‌కు ఆర్థిక సాయం




శివకు ఆర్థిక సాయం అందజేస్తున్న నాయకులు

మిర్యాలగూడ రూరల్, జూలై 2: జేఈఈ అడ్వాన్స్‌లో ఆల్ ఇండియా 211వ ర్యాంక్, ఓబీసీ కేటగిరిలో 24వ ర్యాంక్‌తో ఐఐటీ బాంబేలో సీటు సాధించిన మండలంలోని యాద్గార్‌పల్లి గ్రామానికి చెందిన కుంచం శివ ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నాడన్న విషయం తెలుసుకున్న జిల్లా రైతుబంధు సమితి మాజీ అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి సీహెచ్‌ఆర్ ఫౌండేషన్ తరుపున రూ.20వేల ఆర్థిక సాయం చేశారు. శివను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు లేని శివ ఈ స్థాయి వరకు కష్టపడి చదివించిన బంధువులను అభినందించారు. కార్యక్రమంలో తడకమళ్ల పీఏసీఎస్ చైర్మన్ పాదూరి సంజీవరెడ్డి, మాజీ సర్పంచ్ దుండిగల సైదమ్మశ్రీనివాస్, గార్లపాటి సతీష్‌రెడ్డి, నాగేందర్, ఆంజనేయులు, అంజయ్య, రవి, ఎల్లయ్య, గోపి, శేఖర్‌రెడ్డి, పద్మాకర్‌రెడ్డి, నాగేందర్‌బాబు, ఉపేందర్, హనుమంతు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలి : సీపీఎం

తిరుమలగిరి(సాగర్), జూలై 2: మండల పరిధిలోని పలు గ్రామాల్లో పేదల కోసం గతంలో సేకరించిన నివాస స్థలాలను పంపిణీ చేయాలని కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కలసాని చంద్రశేఖర్, న్యాయవాది గోదాల వెంకట్‌రెడ్డి కోరారు. మిర్యాలగూడలోని ఆర్డీవో కార్యాలయంలో మంగళవారం ఆర్డీవో శ్రీనివాస్‌రావుకు వినతిప త్రం అందజేశారు. కుందూరు జానారెడ్డి హోంమంత్రిగా పనిచేసినప్పుడు పలు గ్రామాల్లో పేదల కోసం ఇళ్ల స్థలాలు సేకరించారని, వాటిని పంపిణీ చేయడంలో గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నందున ఆ స్థలాలను అర్హులైన పేదలకు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నెమలి శ్రీధర్‌రెడ్డి, కాశీమల్ల ప్రవీణ్‌కుమార్, వంగూరి వెంకన్న తదితరులు ఉన్నారు.



ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పదవి ముగిసినా ప్రజల్లోనే ఉంటే గుర్తింపు



దామరచర్ల: ఎంపీపీని సన్మానిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



నకిరేకల్: ఎంపీపీని సన్మానిస్తున్న ఎమ్మెల్యే వీరేశం

దామరచర్ల, జూలై 2: పదవీకాలం ముగిసినప్పటికీ ప్రజల్లోనే ఉండి సమస్యలు పరిష్కరించేందుకు కృషిచ చేయాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. పదవీకాలం ముగిసిన ఎంపీపీ నందినిరవితేజ, ఎంపీటీసీలను మంగళవారం సన్మానించారు. ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేస్తే మరోసారి ఆశీర్వదిస్తారని తెలిపారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

హాలియా: ఐదు సంవత్సరాలుగా మండల అభివృద్ధికి ఎంపీపీ, ఎంపీటీసీలు కృషిచేశారని జడ్పీ వైస్ చైర్మన్ ఇరిగి పెద్దులు, ఎంపీడీవో సుజాత అన్నారు. హాలియా ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ, జడ్పీ వైస్‌చైర్మన్, వైస్ ఎంపీపీల, ఎంపీటీసీలను మంగళవారం సన్మానించారు. అధికారులను, ప్రజాప్రతినిధులను సమన్వయం చేసి మండలంలోని సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేశారన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మాలే అరుణ సత్యనారాయణరెడ్డి, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు రావుల రాంబాబుయాదవ్, ఉర్లగొండ వెంకటయ్య, రమేష్, ఆవుల ఎల్లమ్మయాదయ్య, కోఆప్షన్ సభ్యుడు షేక్ మున్నా పాల్గొన్నారు.

చింతపల్లి: ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారం కోసం అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని జడ్పీటీసీ కంకణాల ప్రవీణ వెంకట్‌రెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కొండూరి భవానీపవన్‌కుమార్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో వైస్ ఎంపీపీ యాచారం యాదయ్య, పీఏసీఎస్ చైర్మన్ లింగంపల్లి వెంకటయ్య, ఎంపీడీవో సుజాత పాల్గొన్నారు.

కనగల్: గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ కరీంపాష అన్నారు. ఎంపీడీవో కార్యాలంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. కనగల్-తిమ్మన్నగూడెం రోడ్డు, దర్వేశిపురం -సాగర్‌రోడ్డు రహదారి దెబ్బతిని ప్రయాణానికి ఇబ్బందిగా ఉందన్నారు. ఎంపీపీ కరీంపాష, జడ్పీటీసీ వెంకటేశంగౌడ్, కోఆప్షన్‌సభ్యుడు ఎండీ మహ్మదాలీ, ఎంపీటీసీల పదవీ కాలం గురువారంతో ముగుస్తుండడంతో వారిని ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది సన్మానించారు. కార్యక్రమాల్లో ఎంపీడీవో జయరాం, తహసీల్దార్ పద్మ, ఎంపీవో సుమలత, సూపరింటెండెంట్ అల్తాఫ్ అహ్మద్, ఎస్ఐ రామ క్రిష్ణగౌడ్, ఏవో అమరేందర్‌గౌడ్, ఆర్ఐ యాదగిరి, ఏపీవో సుధాకర్ పాల్గొన్నారు.

నకిరేకల్: గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ బచ్చుపల్లి శ్రీదేవి గంగాధర్‌రావు అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. మండలంలోని నర్సింహ్మపురం, మోదినిగూడెం, టేకులగూడెం, గొల్లగూడెం, నడిగూడెం ఆవాస గ్రామాల్లో రేషన్ బియ్యం పంపిణీ చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో చంద్రశేఖర్, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు తీగల జాన్‌శాస్త్రి, పీఏసీఎస్ చైర్మన్ నాగులవంచ వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు. ఎంపీపీ బచ్చుపల్లి శ్రీదేవిగంగాధర్‌రావు, ఎంపీటీసీలను ఎమ్మెల్యే సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పూజార్ల శంభయ్య, చామల శ్రీనివాస్, నాయకులు పన్నాల రాఘవరెడ్డి, గాదగోని కొండయ్య, పన్నాల శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

మునుగోడు: తమ హయాంలో జరిగిన పల్లెల ప్రగతి సంతృప్తిచ్చిందని ఎంపీపీ కర్నాటి స్వామియాదవ్ అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన మండల పరిషత్ చివరి సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. డీసీసీబీ చైర్మన్‌గా ఎన్నికైన మునుగోడు పీఏసీఎస్ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి తొలిసారిగా సమావేశానికి హాజరయ్యారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు స్వాగతం పలికి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం పని చేస్తేనే ప్రజా ప్రతినిధులకు గుర్తింపు ఉంటుందన్నారు. జడ్పీటీసీ నారబోయిన స్వరూపరాణిరవిముదిరాజ్ మాట్లాడారు. ఎంపీపీ కర్నాటి స్వామియాదవ్, జడ్పీటీసీ నారబోయిన స్వరూపరాణి రవిముదిరాజ్, వైస్ ఎంపీపీ అనంత వీణస్వామిగౌడ్, బదిలీ అయిన ఎంపీడీవో భాస్కర్‌గౌడ్, సునీత, ఎంపీటీసీలు, కోఆప్షన్ సభ్యులను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో పూజ, విజయ్‌భాస్కర్, ఎంపీవో స్వరపరాణి పాల్గొన్నారు.

జాబ్ క్యాలెండర్ వెంటనే విడుదల చేయాలి



నల్లగొండలో వినతిపత్రం అందజేస్తున్న నాయకులు



కొండమల్లేపల్లిలో వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

రామగిరి, జూలై 2: జాబ్ క్యాలెండర్‌ను వెంటనే విడుదల చేయాలని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు వంగూరి రాఖీ డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. నీళ్లు, నిధులు నియామకాల కోసం ఏర్పడిన తెలంగాణలో నేటి వరకు నిరుద్యోగులు అన్యాయానికి గురవుతున్నారన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం వ్యవహరించిన మొండి తీరునే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తూ నిరుద్యోగులను మోసం చేస్తుందన్నారు. నిరుద్యోగుల పట్ల నిర్లక్ష్యం వీడకపోతే రానున్న రోజుల్లో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు శ్రీకాంత్, దుబ్బాక సాయి, కార్యదర్శులు బుడగ భరత్, నాయకులు నందిపాడు శ్రీకాంత్, లోహిత్‌రెడ్డి, మేకల అనీల్, శివ, రుద్ర, ఆనంద్, బిల్లా నాయక్, వేణుగోపాల్, శివారం, వెంకన్న, వంశీ ఉన్నారు.

● నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి పెదమాం భరత్ డిమాండ్ చేశారు. అడవిదేవులపల్లి మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం వితిపత్రం అందజేశారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలన మాదిరిగానే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా నిరుద్యోగులను మోసం చేస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే మెగా డీఎస్సీ ప్రకటించాలని, జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పానుగోతు కోటేష్, పెద్దింటి కొండలు, రవీందర్, శంకర్, శివ, మహేష్, శ్రీను, వెంకన్న, సతీష్ పాల్గొన్నారు.

దేవరకొండ: నిరుద్యగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బీజేవైఎం ఆధ్వర్యంలో కొండమల్లేపల్లి ఎంపీడీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. సంఘం జిల్లా కార్యదర్శి భూతరాజు భరత్ మాట్లాడుతూ నిరుద్యోగ భృతి చెల్లించాలన్నారు. కార్యక్రమంలో నెల్లికంటి గోపి, భూతరాజు లింగం, బోడ కృష్ణ, అంజి, దేవవేందర్, వెంకటేస్, ఉదయ్, శరత్, పవన్ తదితరులున్నారు.

నార్కట్‌పల్లి: నిరుద్యోగ సమస్యలపై బీజేవైఎం మండల కమిటీ ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ నిరుద్యోగులకు ఇచ్చిన హామీ మేరకు జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలన్నారు. నిరుద్యోగ భృతి ఇవ్వాలని వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో బీజేవైఎం నియోజకవర్గ కన్వీనర్ నడింపల్లి శ్రవణ్‌కుమార్, బీజేపీ మండల అధ్యక్షుడు కొర్వి శంకర్, మునుకుంట్ల గణేశ్, నోముల నాగరాజు, మల్లేశ్, పాలకూర రమేశ్, ఏర్పుల పరమేశ్, ఉండ్రాతి అంజి, కొత్త మహేశ్, పానుగుల శివకుమార్, పుట్టపాక శివ, పాల సాయి తదితరులు పాల్గొన్నారు.

కనగల్: నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం తహసీల్దార్ పద్మకు బీజేవైఎం నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గ్రూప్ పోస్టుల పెంపుతోపాటు డీఎస్సీని వాయిదా వేసి 25వేల పోస్టులతో మెగా డీఎస్సీని ప్రకటించాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి రెండు లక్షల ఉద్యోగాలని చెప్పి నిరుద్యోగులను దగా చేశాని ఆరోపించారు. విద్యార్థుల ఆందోళనలను పట్టించుకోవటం లేదన్నారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం నాయకులు దుర్గ, గోపి, సురేష్‌గౌడ్, నాగరాజు, దేవి, లక్ష్మణ్, అశోక్ తదితరులు ఉన్నారు.

సంక్షేమ హాస్టళ్లకు పక్కా భవనాలు నిర్మించాలి

నకిరేకల్, జూలై 2: జిల్లాలోని సంక్షేమ హాస్టళ్లకు పక్కా భవనాలు నిర్మించాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగార్జున డిమాండ్ చేశారు. కేవీపీఎస్ నకిరేకల్ కమిటీ ఆధ్వర్యంలో మంగళ వారం నకిరేకల్‌లోని సంక్షేమ హాస్టళ్లను పరిశీలించి విద్యార్థులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎందరు పాలకులు మారినా సంక్షేమ హాస్టళ్లలో సమస్యలు తీరడం లేదని వర్షం వస్తే విద్యార్థులు ఎంతో ఇబ్బంది పడుతున్నారన్నారు. జిల్లాలో సంక్షేమ హాస్టళ్లకు పక్కా భవనాలు లేకపోవడంతో అరకొర సౌకర్యాలతో విద్యార్థులు ప డుతున్నా పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధుల ద్వారా ప్రతి మండలంలో సంక్షేమ హాస్టళ్లు నిర్మించేందుకు అవకాశం ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు వంటెపాక కృష్ణ, నాయకులు చిలుమల రామస్వామి, అరవింద్, జమదగ్ని తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన రైతులకు పెట్టుబడి సాయం



మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి

మునుగోడు, జూలై 2: అర్హులైన రైతులందరికీ రైతు భరోసా కింద పెట్టుబడి సాయం అందుతుందని డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మునుగోడు సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) కార్యాలయం ఆవరణలో మంగళవారం నిర్వహించిన రైతు భరోసా, రైతు రుణమాఫీలపై రైతుల అభిప్రాయ సేకరణలో ఆయన మాట్లాడారు. దేశానికి అన్నం పెట్టే రైతు శ్రేయస్సు కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రైతు రాజు కావాలన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారని తెలిపారు. రైతుల అభిప్రాయాలను నేరుగా తెలుసుకొని ఐదు నుంచి 10 ఎకరాల్లోపు సాగు చేస్తున్న నిజమైన రైతులకు మాత్రమే రైతు భరోసాను ఇచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఏడీఏ ఎల్లయ్య, ఏఈవోలు, రైతులు, పీఏసీఎస్ డైరెక్టర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సాగు చేస్తున్న రైతులకు 'భరోసా' ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న పీఏసీఎస్ చైర్మన్ కోడి సుష్మవెంకన్న

చండూరు, జూలై 2: సాగు చేసే రైతులకు రైతు భరోసా ఇవ్వాలని రైతులు అభిప్రాయపడ్డారు. చండూరు పీఏసీఎస్‌లో చైర్మన్ కోడి సుష్మవెంకన్న అధ్యక్షతన రైతుల నుంచి అభిప్రాయాలు సేకరించారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు కొండలు, గుట్టలు భూములు కొనుగోలు చేసి సాగు చేయకుండా ఉన్న భూములకు రైతు భరోసా పథకం వర్తించకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. 10ఎకరాల లోపు భూములు కలిగి ఉన్న వారికి ఈ పథకాన్ని వర్తింపజేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సహకార ఆడిట్ అధికారి, డిప్యూటీ రిజిస్ట్రార్ గోలి శ్రీనివాస్, వంగూరి విజయకృష్ణ, ఏఓ రేవతి, రైతులు పాల్గొన్నారు.

దామరచర్ల: రైతు భరోసాపై మండల కేంద్రంలోని పీఏసీఎస్ కేంద్రం వద్ద చైర్మన్ దుర్గంపూడి నారాయణరెడ్డి అధ్యక్షతన మంగళవారం మహాజన సభ సమావేశం నిర్వహించారు. రైతుల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించి అభిప్రాయాలను ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ లలితహాతీరాంనాయక్, ఏవో కల్యాణ్‌చక్రవర్తి, ఏఈవో పార్వతి, కార్యదర్శి వెంకట్‌రెడ్డి, నాయకులు గాజుల శ్రీనివాస్, మట్టయ్య, వీరస్వామి పాల్గొన్నారు.

విద్యారంగాన్ని భ్రష్టు పట్టిస్తున్న కేంద్ర ప్రభుత్వం

హాలియా, జూలై 2: దేశంలోని మోదీ సర్కార్ విద్యా రంగాన్ని భ్రష్టు పట్టిస్తోందని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆకారపు నరేష్ అన్నారు. హాలియాలో మంగళవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. పేపర్ లీకులతో దేశ ప్రతిష్ఠను అంతర్జాతీయంగా పరువు తీశారన్నారు. నీట్ పేపర్ లీకైందని నిజాలను సీట్ తేల్చిందని, లీకైనట్లు నిందితులు అంగీకరించిన తర్వాత కూడా కేంద్రం విచారణ చేయకుండా తప్పించుకునే ప్రయత్నం చేస్తోందన్నారు. నీట్ స్కామ్‌పై సమగ్ర విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కూడా ప్రైవేటు, కార్పొరేట్ ఫీజులు దందాను నియం త్రించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 4వ తేదీన నిర్వహించే విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు నల్లబెల్లి జగదీష్, కోరే రమేష్, సాయి, చందు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ విజ్ఞాన యాత్రలో స్వాన్ సభ్యులు

నార్కట్‌పల్లి, జూలై 2: నార్కట్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన స్వాన్ (స్టూడెంట్ వెల్ఫేర్ అసోషియేసన్ ఆఫ్ నార్కట్‌పల్లి) సభ్యులు పర్యావరణ విజ్ఞాన యాత్ర చేశారు. యాత్రలో భాగంగా రంగారెడ్డి జిల్లా అన్మాస్‌పల్లిలోని కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ కేంద్ర బిందువైన ఎర్త్ సెంటర్‌ను సందర్శించారు. కార్యక్రమాలను సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు లీలా లక్ష్మారెడ్డి వివరించారు. పర్యావరణంపై ఉద్యమించేందుకు ఎర్త్ లీడర్స్‌ను తయారు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో దామెర ఉదయ్, గూడూరు అంజిరెడ్డి, కన్నెబోయిన నర్సింహ, శ్రవణ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు

కనగల్, జూలై 2: ఇసుక అక్రమ రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ పద్మ హెచ్చరించారు. కనగల్‌లో సాండ్ ట్యాక్సీ అమలుపై మండలకేంద్రంలో ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్లకు మంగళవారం నిర్వహించిన అవగాహన సమావేశంలో మాట్లాడారు. నిబంధనల మేరకే ఇసుక తరలించాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేసి, వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఇసుక తరలించే సమయంలో అనుమతి పత్రాలను తప్పనిసరిగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రామకృష్ణగౌడ్, ఎంపీవో సుమలత, ఆర్ఐ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ పద్మ

పాల ఉత్పత్తిదారుల సంఘం చైర్మన్‌గా సైదులు

చిట్యాల రూరల్, జూలై 2: మండలంలోని చిన్నకాపర్తి పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం చైర్మన్‌గా దాసరి సైదులు ఎన్నికయ్యారు. డెరెక్టర్లుగా మెట్టు ఇందిరమ్మ, ఎల్లమ్మ, ఎడ్ల మల్లయ్య, పటేల్ అమృతారెడ్డి, పొలిమేర పర్వతాలు, పాకాల యాదయ్య, వలిగొండ యాదయ్య, మామిడి శ్రీనులు ఎన్నికయ్యారు. ఎన్నికైన పాల ఉత్పత్తిదారుల సంఘం కమిటీ సభ్యులు నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశంను కలిశారు. కార్యక్రమంలో ఆవుల సుందర్, మెట్టు వెంకటేశం, ఓమయ్య, సత్యనారాయణ, నర్సింహ్మా, రాజ్‌కుమార్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మునుగోడు రూరల్: ఉకొండి గ్రామ పాల సంఘం సొసైటీ చైర్మన్‌గా కాంగ్రెస్ పార్టీకి చెందిన కమ్మంపాటి జయమ్మ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన వంతుగా పాల సంఘం సొసైటీ సమస్యల పరిష్కారానికి తన వంతుగా కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా ఆమె తన ఎన్నికకు సహకరించిన డైరెక్టర్లకు ధన్యవాదాలు తెలిపారు.

డీసీసీబీ చైర్మన్‌కు సన్మానం

మునుగోడు రూరల్, జూలై 2: డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డిని వెదిరే పూలమ్మ ఫౌండేషన్ చైర్మన్ మెగారెడ్డి జిల్లాకేంద్రంలోని సహకార కార్యాలయంలో పూల బోకే శాలువాతో ఘనంగా సన్మానించారు.

ఇసుక అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు

మిర్యాలగూడ రూరల్, జూలై 2: గ్రామాల్లో ఎవరైనా ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హరిబాబు అన్నారు. మంగళవారం మండలంలోని తడకమళ్ల, తక్కెళ్లపాడు గ్రామాల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనుమతి లేకుండా ఎవరైనా మూసీ, పాలేరు వాగుల నుంచి ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలిస్తే అట్టి ట్రాక్టర్లను సీజ్ చేయడంతోపాటు డ్రైవర్లపై, యజమానులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

దండోరా రజతోత్సవాలను జయప్రదం చేయాలి

చిట్యాల, జూలై 2: ఎమ్మార్పీఎస్ టీఎస్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఈ నెల 7న నిర్వహించే దండోరా రజతోత్సవాలను జయప్రదం చేయాలని సంఘం నకిరేకల్ నియోజకవర్గ ఇన్‌చార్జి పోలేపల్లి సత్యనారాయణ కోరారు. మంగళవారం చిట్యాలలో రజతోత్సవాల ప్రచార పోస్టర్‌లను విడుదల చేశారు. ఎస్సీ వర్గీకరణ వెంటనే చేపట్టాలనీ కోరారు. ఈ కార్యక్రమంలో పిల్లి నగేష్, బరాల వెంకన్న, జిట్ట స్వామి, జిట్ట సైదులు పాల్గొన్నారు.

వాహనాలకు నెంబర్ ప్లేట్లు ఉండాలి

మర్రిగూడ, జూలై 2: రాష్ట్ర ప్రభుత్వం జూలై నుంచి కొత్త చట్టాన్ని అమల్లోకి తెస్తున్నందున వాహనదారులు వాహనాలకు తప్పనిసరిగా నెంబర్ ప్లేట్లు కలిగి ఉండాలని మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. మైనర్‌లు వాహనాలు నడిపినట్లయితే తల్లిదండ్రులే బాధ్యత వహించాల్సి వస్తుందని, అదేవిధంగా శిక్షార్హులు అవుతారని వారు అన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని వారు హెచ్చరించారు. వీరి వెంట సిబ్బంది ఉన్నారు.

'రాజగోపాల్‌రెడ్డికి మంత్రివర్గంలో చోటు కల్పించాలి '

మర్రిగూడ, జూలై 2: మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మంత్రి వర్గ విస్తరణలో అవకాశం కల్పించాలని ఎంపీపీ గండికోట రాజమణిహరికృష్ణ, మాజీ జడ్పీటీసీ మేతరి యాదయ్య కోరారు. మర్రిగూడలో మంగళవారం మాట్లాడుతూ మునుగోడు అభివృద్ధి చెందాలంటే రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి ఇస్తే మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. మునుగోడు నియోజకవర్గమే కాకుండా ఉమ్మడి నల్లగొండ జిల్లా సైతం అభివృద్ధి జరుగుతుందని వారు అన్నారు. ప్రజల అభీష్టమేరకు కోమటిరెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు రాందాసు శ్రీనివాస్, కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రసిడెంట్ నక్క తిరుపతయ్య, యాదయ్య, బంగారం, రేవంత్ యాదవ్, బండి హనుమంత్ తదితరులు పాల్గొన్నారు.

నేడు రైతు మహాజన సభ సమావేశాలు

పెద్దవూర, జూలై 2: ప్రభుత్వం చేపట్టే రైతు భరోసా పథకంపై రైతుల సలహాలు, సూచనలు స్వీకరించడానికి నేడు మండల కేంద్రంలోని పీఏసీఎస్ వద్ద ఉదయం 9గంటలకు నిర్వహించే రైతు మహాజన సభ సమావేశానికి రైతులు హాజరై తమ అభిప్రాయాలను తెలియచేయాలని చైర్మన్ గుంటుక వెంకట్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు.

శాలిగౌరారం: రైతు భరోసా పథకంపై బుధవారం ఉదయం 10గంటలకు శాలిగౌరారం సింగిల్ విండో కార్యాలయంలో ప్రజాభిప్రాయ సేకరణ ఉంటుందని సింగిల్ విండో చైర్మన్ తాళ్లూరి మురళి, సీఈవో నిమ్మల అంజనేయులు తెలిపారు. సమావేశానికి జిల్లా వ్యవసాయ అధికారి పాల్వాయి శ్రవణ్‌కుమార్, అధికారులు పాల్గొంటారని అన్నారు. రైతులందరూ సకాలంలో హాజరై అభిప్రాయాలు తెలియజేయాలన్నారు.

పెద్దఅడిశర్లపల్లి: రైతుభరోసా పథకంపై రైతుల అభిప్రాయ సేకరణ, సూచనలు, సలహాల కోసం మండలకేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో బుధవారం ఉదయం 10 గంటలకు చైర్మన్ మణిపాల్‌రెడ్డి అధ్యక్షతన జరిగే ప్రత్యేక మహజన సభ సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు పీఏసీఎస్ సీఈవో వెంకటేశ్వరరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి మండలంలోని రైతులు అందరు సకాలంలో హజరై తమ అభిప్రాయాలను వ్యక్త పరచగలరని కోరారు.

కంటి అద్దాల పంపిణీ

చిట్యాల రూరల్, జూలై 2: ఉచిత కంటి వైద్య శిబిరం ద్వారా కంటి ఆపరేషన్ చేయించుకున్న మండలంలోని గుండ్రాంపల్లి గ్రామస్థులకు డీసీసీబీ వైస్ చైర్మన్ ఏసిరెడ్డి దయాకర్‌రెడ్డి మంగళవారం ఉచిత కంటి అద్దాలను అందజేశారు. ఏసిరెడ్డి శ్రీరామ్‌రెడ్డి, కృపాకర్‌రెడ్డిల జ్ఞాపకార్థం ఏప్రిల్ 5న గుండ్రాంపల్లిలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. కాగా ఈ వైద్య శిబిరంలో పరీక్షలు చేయించుకోగా శస్త్రచికిత్సలు చేయించుకున్న వారికి కంటి అద్దాలు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఏసిరెడ్డి బుచ్చిరెడ్డి, నమ్మూల విజయ్‌కుమార్, దోర్నాల రామచంద్రం, దుబ్బ కుమార్, బత్తుల సత్తయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.